కర్నూలు | నంద్యాల
వార్త
15 ఫిబ్రవరి 2026 ఆదివారం పేజీలు 4


# సంక్షేమంతో పాటు రాష్ట్ర అభివృద్ధిని పరుగులు పెట్టించేలా బడ్జెట్ : మంత్రి టీజీ భరత్

**కర్నూలు హాస్పిటల్ ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :**
శాసనసభలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ రూ.3,32,205 కోట్లతో ప్రవేశపెట్టిన 202627 వార్షిక బడ్జెట్ రాష్ట్రాన్ని అభివృద్ధి దిశలో తీసుకెళ్లడంతో పాటు సంక్షేమాన్ని పరుగులు పెట్టించేలా ఉందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. బడ్జెట్‌పై ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యార్థుల నుండి రైతులు, వ్యాపారులు, పేదలు, మహిళలు, బీసీ,ఎస్సీ,ఎస్టీ, మైనారిటీ, అన్ని సామాజిక వర్గాల వారికి ఎంతో ప్రయోజనం చేకూర్చేవిధంగా రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ ఉందని పేర్కొన్నారు. ఆర్థిక లోటు ఉన్నప్పటికీ సంక్షేమ



పథకాలకు పెద్దపీట వేశామన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎంతో నష్టం జరిగిందని, సీఎం నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అభివృద్ధిలో రాష్ట్రం ఎంతో ముందుకెళ్తోందన్నారు. అమరావతి నిర్మాణంతో పాటు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. బడ్జెట్‌లో రాయలసీమ గ్లోబల్ హార్టికల్చర్ హబ్ కోసం రూ.30,000 కోట్లు కేటాయించడం గొప్ప నిర్ణయమని పేర్కొన్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానం అమలుచేయడం వల్లే పెట్టుబడుల్లో రాష్ట్రం ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్ అందరికీ అనుకూలమైందన్నారు.

## యాగంటిలో.. ప్రారంభమైన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు

**బనగానపల్లె, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:**
మండలం లోని ఎర్రమల కొండల్లో వెలసిన మహిమాన్విత శైవ క్షేత్రం యాగంటి శ్రీ ఉమామహేశ్వర స్వామి సన్నిధిలో శనివారం మహాశివరాత్రి వైభవంగా బ్రహ్మోత్స వాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ఈవో డి పాండురంగారెడ్డి, చైర్మన్ బండి మోళీశ్వర రెడ్డి, పాలక మండలి సభ్యుల ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ ఉత్స వాల సందర్భంగా గర్భాలయంలో శ్రీ ఉమామహేశ్వరస్వామి విగ్రహాలకు, ఎదురుగాఉన్న అలంకార మండపంలోని స్వామివారి ఉత్స వమూర్తులకు ప్రత్యేక పూజలతోపాటు గణపతి పూజ, పుణ్యాహవచనం, త్రిశూల చండీశ్వరార్చన, దీక్ష కంకణధారణలను భక్తి శ్రద్ధలతో చేపట్టారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని ధ్వజస్తంభం వద్ద ఉత్స వ మూర్తులను కొలువుదీర్చి ఆలయ ప్రధాన అర్చకులు మహేష్ శర్మ, సత్యనారాయణ శర్మ, సహాయ అర్చకులు లోక్ నాథశర్మ దేవేంద్ర శర్మ, రాఘవేంద్రశర్మ, వేద పండితులు కిషోర్ శర్మలు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్స వాలకు సకల దేవతలను ఆహ్వానించేందుకు వీలుగా ధ్వజారోహణ కార్యక్రమాన్ని ఘనంగా జరిపారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు,ఆలయ సిబ్బంది ప్రసాద్,రమేష్ బాబు పాల్గొన్నారు.



# హర హర మహాదేవ.. శంభో శంకర..!



- మహేశా పాప వినాశ..కైలాసా వాసా ఈశా..
- అద్భుతమై రేయి..మహా శివరాత్రి రేయి..
- జాగరణ, ఉపవాసాల మేలు కలయిక మహా శివరాత్రి..
- పలుచోట్ల శివరాత్రోత్సవాలు.. ఆధ్యాత్మిక కార్యక్రమాలు..
- శివాలయాల్లో ప్రత్యేక పూజలకు సన్నద్ధం..
- నేడు మహాశివరాత్రి.. జంగమయ్య జాగరణ..

**"ప్రభు ప్రాణనాథం విభుం విశ్వ నాథం.. జగన్నాథం సదానందభాజం.. భవద్భవ్య భూతేశ్వరం భూతనాథం.. శివం శంకరం శంభు మీశాన మీడే..గళే దండమాలం తనౌ సర్పజాలం.. మహాకాలకాలం.. గణేశాదిపాలం.. జటా జూటగంగోత్తరంగౌర్విశాలం శివం శంకరం శంభు మీశాన మీడే"..**

**కోసిగి, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త :**
'శ' అంటే శివుడు.. 'వ' అంటే శక్తి అని శివ పద మణి మాల చెబుతోంది.. 'శివ' అంటే మంగళకరం..ఆనందం, శుభం, కైవల్యం, శ్రేయం అని, శివరాత్రి అంటే శుభప్రదమైన రాత్రి..శివరాత్రి రోజు ఉపవాసం, జాగారణం, శివ దర్శనం, అభిషేకార్చనలు మనిషిలోని అజ్ఞానాంధకారాన్ని తొలగిస్తాయి.. అందుకే ఈ మాఘ బహుళ చతుర్ధశి పర్వదినాన ఆ ఆదిభిక్షువు..లయకారుడు. భోళాశంకరుడు..మృత్యుంజయుడు.. గరళకంఠుని దర్శించుకునేందుకు భక్తులు ఉవ్విళ్లూరుతుంటారు.. మహాశివరాత్రి రోజు ప్రతి యామంలోనూ శివునికి అభిషేకం చేస్తారు.. రాత్రిలో నాలుగు యామాలుంటాయి. ఆత్మకి నాలుగు పదాలు ఉన్నట్టు అని అర్థం. నాలుగో యామంలో జాగరణ ద్వారా ఆత్మ పరమార్థం గోచరించటం జరుగుతుందని ఆధ్యాత్మిక ఉపన్యాసకులు చెబుతారు.. పరమ జ్ఞానోదయమే శివజాగరణ రహస్యం. ముల్లోకాలు, సకల చరాచర సృష్టిలో ప్రతి జీవి, ప్రాణి సమస్త భక్తకోటి ఎదురుచూసే పర్వదినం మహాశివరాత్రి.. లోక రక్షకుడైన పరమశివుడు కోటి సూర్య కాంతులతో మహాశివరాత్రి పర్వదినం నాడు మహాలింగంగా ప్రభవిల్లుతూ ఉద్భవించారని ఈశాన సంహితలో చెప్పబడింది. సృష్టికర్త అయిన బ్రహ్మ, స్థితికర్త అయిన విష్ణువుల తగవును తీర్చేందుకు వారిరువురి నడుమ పరమశివుడు మహాతేజోమయంగా లింగరూపంలో ఉద్భవించడారని ఇతిహాసాల ద్వారా తెలుస్తోంది.. అంతటి విశేషమైన రోజున శివుడి ఆరాధన కోసం శివుడు కొలువైన క్షేత్రాలకు భక్తులు తరలి వస్తుంటారు.. పురాణ దేవతల్లో అత్యంత ప్రజాస్వామికవాది, నిరాడంబరుడు, భార్యను తనలో సగంచేసుకున్న స్త్రీ సమానత్వ వాది, కోరిన వారికి కోర్కెలు ఇచ్చే భోళాశంకరుడైన పరమేశ్వరుని అత్యంత భక్తి, శ్రద్దలతో, ఉపవాస పూజలతో కొలిచే మహాపర్వదినం మహాశివరాత్రి నేడు..









• వివరాలు 2లో

## అభివృద్ధి-సంక్షేమమే లక్ష్యంగా 2026-27 బడ్జెట్

**: జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ**

**కర్నూలు హాస్పిటల్ ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :**
రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం, భవిష్యత్ లక్ష్యంగా కూటమి ప్రభుత్వం 2026-27 బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని కర్నూలు పార్లమెంట్ అధ్యక్షులు గుడిసె ఆది కృష్ణమ్మ తెలిపారు. ఈ బడ్జెట్ ప్రజల ఆశలు-ఆకాంక్షలకు అనుగుణంగా ఉండి రాష్ట్రానికి స్పష్టమైన దిశానిర్దేశం చేస్తుందని అన్నారు. విజన్ ఉన్న నాయకత్వంతో నారా చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో ఈ బడ్జెట్ రూపొందించబడిందని పేర్కొన్నారు. సమతుల్యంగా అభివృద్ధి-సంక్షేమాన్ని ముందుకు తీసుకెళ్లేలా రూపొందించినందుకు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రత్యేకంగా రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేయాలనే నిర్ణయం చారిత్రాత్మకమని చెప్పారు. రూ.30 వేల కోట్ల పెట్టుబడులతో పండ్లు-కూరగాయల ఉత్పత్తి, ప్రాసెసింగ్, ఎగుమతుల్లో రాయలసీమను అగ్రస్థానానికి తీసుకువెళ్లే అవకాశం ఉందన్నారు. కర్నూలు జిల్లాకు ఓర్వకల్లులో డ్రోన్ సిటీ, 30 పడకల ఈఎస్ఐ ఆసుపత్రి, హంద్రీ-నీవా ప్రాజెక్టు, రోడ్లు-పోర్టులు-ఎయిర్‌పోర్టుల అభివృద్ధికి భారీ కేటాయింపులు జిల్లాకు మరింత బలం చేకూరుస్తాయని అన్నారు.



## గజ వాహనాదీశా.. పాహిమాం.. పాహిమాం







**శ్రీశైలం ప్రాజెక్టు ఫిబ్రవరి 14, ప్రభాతవార్త :**
మహాశివరాత్రిని పురస్కరించుకుని నవాహ్నిక దీక్షతో పదకొండు రోజుల పాటు నిర్వహింపబడే మహాశివరాత్రి బ్రహ్మోత్స వాలు ఏడవ రోజైన శ్రీస్వామిఅమ్మవార్లకు విశేష పూజలు జరిపించారు. తరువాత యాగశాల యందు శ్రీ చండీశ్వర స్వామికి ప్రత్యేక పూజాదికాలు జరిగాయి. అనంతరం లోక కల్యాణం కోసం జపాలు, పారాయణలు చేశారు. అనంతరం మండపారాధనలు, పంచావరణార్చనలు, శివపంచాక్షరి, నిత్యహవనాలు, రుద్రహోమం, చండీహోమం, కార్యక్రమాలు శాస్త్రం ప్రకారంగా జరిపించారు. అదే విధముగా ఈ సాయంకాలం ప్రదోష కాల పూజలు, జపానుష్ఠానాలు, రుద్రపారాయణలు, హోమాలు నిర్వహించారు.

**గజ వాహనాదీశా పాహిమాం పాహిమాం:**
మహాశివరాత్రి బ్రహ్మోత్స వాలలో భాగంగా శనివారం నాడు రాత్రి శ్రీస్వామిఅమ్మవార్లకు గజవాహనసేవ జరిపించారు. ఈ సేవలో శ్రీ స్వామిఅమ్మవారి ఉత్స వమూర్తులను అక్కమహాదేవి అలంకార మండపంలో గజవాహనంపై వేంచేబు చేయించి ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. విశేషంగా అలంకరించిన స్వామి అమ్మవార్లను ఆలయం వెలుపలకు తోడుకొని వచ్చి గంగాధర మండపం నుంచి పురవీధుల్లో వైభవంగా ఊరేగింపు చేశారు. ఈ గ్రామ ఉత్స వంలో ధర్మకొత్తల మండలి అధ్యక్షులు పి.రమేష్ నాయుడు, శ్రీశైల దేవస్థానం ఈవో ఎం. శ్రీనివాసరావు, అధికారులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు. గ్రామోత్స వంలో నాదస్వరం, కోలాటం, చెక్కభజన, రాజభటులవేషాలు, కేరళ చండీమేళం, కొమ్ముకొయ్య నృత్యం, ముంబాయ్ డోల్ థేష్, విళక్కు, స్వాగత నృత్యం, వీరభద్రడోలు కుణిత, జాంజ్ పథక్ ( కర్ణాటక డోలు) కాళికా నృత్యం, జానపద పగటి వేషాలు, నందికోలు సేవ, గొరవనృత్యం, తప్పెటచిందు, బీరప్పడోలు, నందికోలసేవ, ఢమరుకం, చిడతలు, శంఖం, పిల్లనగ్రోవి, డోలు విన్యాసం, గిరిజన చెంచు నృత్యం తదితర కళారూపాలను గ్రామోత్స వంలో ఆయా కళారూపాలను భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

## నిరంతరం అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలి

**– జిల్లా ఎస్పీ సునీల్ షొరాన్**

**నంద్యాల, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త :**
ప్రతినిధిః నిరంతరం అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ సునీల్ షొరాన్ అధికారులను అదేశించారు. మహా శివరాత్రి బ్రహ్మోత్స వాలను పురస్కరించుకొని శ్రీశైలం పాతాళగంగ పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన బందోబస్తును జిల్లా ఎస్పీ పరిశీలిస్తు పాతాళగంగ మెట్లమార్గంలో సంబంధిత అధికారులు నిర్వహించాల్సి న విధులపై పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ భక్తుల రద్దీ ఎక్కువగా ఉన్నందున మెట్లమార్గం ద్వారా భక్తులు జాగ్రత్తగా వెళ్లాలని పుణ్యస్నానాలు అచరించిన భక్తులు అధికారులు ఏర్పాటు చేసిన భద్రత నిబంధనలు ఉల్లంఘించి ముందుకు వెళ్లరాదని శబ్ద యంత్రం ద్వారా భక్తులకు తెలియజేయాలన్నారు. ప్రతిఒక్కరు ప్రయాణికుని భద్రత రక్షణ దృష్టిలో ఉంచుకోవాలి, లైఫ్ జాకెట్ వేసుకున్న తర్వాతనే ప్రయాణం చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను అదేశించారు. బోట్ల ద్వారా ప్రయాణికులను విహారయాత్రకు తీసుకెళ్లే బోటు నిర్వాహకులు తప్పనిసరిగా భద్రత ప్రమాణాలు పాటించాలన్నారు.



## శ్రీశైలంలో పాగాలంకరణ ఏర్పాట్లను పరిశీలించిన డిఐజి, ఎస్పీ

**శ్రీశైలం ప్రాజెక్టు ఫిబ్రవరి 14, ప్రభాతవార్త :**
మహాశివరాత్రి బ్రహ్మోత్స వాలను పురస్కరించుకుని శ్రీశైల మహా పుణ్యక్షేత్రంలో శివరాత్రి రోజు నిర్వహించనున్న పాగాలంకరణ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ మరియు జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ పాగా అలంకరణ దర్శనం కోసం ఆహ్లాదకర వాతావరణం ఉండేలా ఏర్పాట్లు చెయ్యాలని,భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలన్నారు. క్యూలైన్లను, భక్తుల రాకపోకల మార్గాలలో పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. ఒక పద్ధతి ప్రకారం గుడి పరిసరాలలో భక్తులు ఉంటూ స్వామి అమ్మవార్ల దర్శనంతో పాటు పాగా అలంకరణ వీక్షించేలా చర్యలు తీసుకోవాలన్నారు. దర్శనార్థం వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సక్రమమైన మార్గదర్శకాలు, తాగునీటి సౌకర్యం, వైద్య సహాయం వంటి మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రత్యేకంగా పాగాలంకరణ సమయంలో భక్తుల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉన్నందున, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ ఏర్పాట్లు, భద్రతా మరియు బందోబస్తు తదితర అంశాలపై సమన్వయంతో విధులు నిర్వహించాలన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అదనపు సిబ్బందిని నియమించి, నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా పరిస్థితులను నిరంతరం పరిశీలిస్తూ అవసరమైన చోట అధికారులకు సూచనలు ఇవ్వాలన్నారు. భక్తులు సంయమనం పాటిస్తూ అధికారుల సూచనలతో పాగా అలంకరణను వీక్షించాలని అనుసరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కర్నూలు రేంజ్ డీఐజీ తో పాటు జిల్లా ఎస్పీ సంబంధిత పోలీసు అధికారులు పాల్గొన్నారు.



# భారీ అంచనాలతో.. బడ్జెట్..!

**: రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్ గా తీర్చిదిద్దుతాం**



**కర్నూలు ఫిబ్రవరి 14 ప్రభాతవార్త ప్రతినిధి :**
ఏపీ ప్రభుత్వం భారీ అంచనాలతో 202627 వార్షిక బడ్జెట్ ను అసెంబ్లీలో ప్రవేశ పెట్టింది. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్ ప్రసంగంలో గత ప్రభుత్వం లో సాగిన పాలన పైన విమర్శలు చేసారు. రాష్ట్ర విభజన ఒక నష్టం అయితే... ఆ తరువాత అయిదేళ్ల పాలన రాష్ట్రానికి నష్టం చేసిందని ఆరోపించారు. ఈ బడ్జెట్ కేవలం పద్దులే కాదని.. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఉంటుందని వెల్లడించారు. అభివృద్ధి సంక్షేమంతో రాష్ట్రాన్ని పరుగులు పెట్టించాలనేదే తమ విధానమని స్పష్టం చేసారు.రాష్ట్ర బడ్జెట్ 202627 ను ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అసెంబ్లీలో ప్రవేశ పెట్టారు. రానున్న ఆర్ధిక సంవత్స రానికి రూ 3,32,205 లక్షల కోట్లతో బడ్జెట్ ప్రతిపాదించారు. స్వర్ణాంధ్ర 2047 లక్ష్యం తో ఈ బడ్జెట్ ప్రతిపాదించినట్లు వెల్లడించారు. రాయలసీమ రైతుల కలలను సాకారం చేసేలా ప్రాధాన్యత ఇచ్చామన్నారు. పెట్టుబడి దారులకు అనుకూల వాతావరణం కల్పించామని ఆర్థిక మంత్రి వివరించారు. కీలక రంగాలకు కేటాయింపులు భారీగా పెంచారు. రెవెన్యూ వ్యయం రూ. 2,56,143 కోట్లు కాగా, మూలధన వ్యయం రూ. 53,915 కోట్లు, రెవెన్యూ లోటు రూ. 22,002 కోట్లు.. ద్రవ్య లోటు రూ. 75,868 కోట్లు . ఇక,శాఖల వారీగా.. వ్యవసాయ శాఖ కు రూ 11,745 కోట్లు, పాఠశాల విద్య కు రూ 32, 208, బీసీ సంక్షేమం రూ 23650 కోట్లు, ఇంధన శాఖ 19,306 కోట్లు, పంచాయితీ రాజ్ కు రూ 22,941 కోట్లు, ఇరిగేషన్ 18,223 కోట్లు, అన్నదాత సుఖీభవ కోసం రూ 6,600 కోట్లు...

• వివరాలు 2లో

## శివరాత్రి రోజున 1.50 లక్షల మంది భక్తుల దర్శనానికి విస్తృత ఏర్పాట్లు: కలెక్టర్

**శ్రీశైలం ప్రాజెక్టు ఫిబ్రవరి 14, ప్రభాతవార్త :**
మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శివరాత్రి రోజున సుమారు 1.50 లక్షల మంది భక్తులకు ఏర్పాట్లు చేయడం జరిగిందని నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా తెలిపారు. ఈ నేపథ్యంలో అన్ని శాఖల సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చెప్పారు. ఆదివారం నిర్వహించనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్స వాల దృష్ట్యా ఆలయ ప్రాంగణం మరియు పరిసర ప్రాంతాలను ఆమె స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, శివరాత్రి రోజున సుమారు 20 గంటల వ్యవధిలో భక్తులు ప్రశాంతంగా, సౌకర్యవంతంగా దర్శనం చేసుకునే విధంగా సమగ్ర ప్రణాళిక అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. భక్తులు అర్ధగంట వ్యవధిలోనే శ్రీ శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానం లో స్వామివారి, అమ్మవార్ల దర్శనం పూర్తి చేసుకునేలా క్యూలైన్లు, భద్రతా ఏర్పాట్లు, ప్రసాద పంపిణీ వ్యవస్థలను సమర్థవంతంగా ఏర్పాటు చేశామని తెలిపారు. దర్శనం అనంతరం భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. శుక్రవారం రోజున దాదాపు 80 వేల మంది భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకోవడంతో పాటు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా స్వామివారి ప్రసాదం, దేవస్థాన భోజన వసతి అందించి సాఫీగా నిర్వహించగలిగామని కలెక్టర్ వివరించారు. బ్రహ్మోత్స వాలు ముగిసే వరకు భక్తులు ఇదే విధంగా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. భక్తుల రద్దీ అధికంగా ఉండే దృష్ట్యా టోల్ గేట్ రుసుము మినహాయింపు, రాత్రి వేళల్లో ప్రయాణాలకు అనుమతులు మంజూరు చేసినట్లు తెలిపారు. అటవీ మార్గంలో పాదయాత్రగా వచ్చే భక్తుల సౌకర్యార్థం 13 ప్రాంతాల్లో త్రాగునీరు, అన్నదానం, వైద్య సేవలు, చలువ పందిళ్లు తదితర సదుపాయాలతో స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అటవీ మార్గంలో ఎవరైనా అస్వస్థతకు గురైతే వెంటనే చికిత్స అందించేందుకు 7 అంబులెన్సులు, వైద్య సిబ్బంది సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అవసరమైతే స్ట్రెచర్ల ద్వారా సమీప ఆసుపత్రులకు తరలించే చర్యలు కూడా చేపట్టినట్లు చెప్పారు. అటవీ ప్రాంతంలో ప్రయాణించే భక్తులు తగు జాగ్రత్తలు పాటిస్తూ శివనామస్మరణతో దర్శనం పూర్తి చేసుకుని సురక్షితంగా స్వస్థలాలకు చేరుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు.



## సింహవాహనంపై స్వామి అమ్మవార్ల దర్శనం

**మహానంది, ఫిబ్రవరి 14, ప్రభాతవార్తః**
మహాశివరాత్రి ఉత్స వాల సందర్భంగా శనివారం శ్రీకామేశ్వరీదేవి సమేత మహానందీశ్వరస్వామి వార్ల ఉత్స వమూర్తుల విగ్రహాలు సింహావాహనంపై భక్తులకు దర్శనమిచ్చాయి. ఉదయం ఆలయ కార్యనిర్వాహణా ధికారి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర్ అవధాని, శాంతారామ్ భట్, నాగేశ్వర శర్మ, హనుమంతు శర్మ, ప్రధాన అర్చకులు అర్జున్ శర్మల ఆధ్వర్యంలో ఋత్వికులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కళ్యాణమండపంలో ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో స్వామి అమ్మవార్ల ఉత్స వ విగ్రహాలను ఆశీనులు చేశారు. ప్రత్యేక పూజలనంతరం గ్రామోత్ స వం నిర్వహించారు. సాయంత్రం శేషవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈకార్యక్రమంలో సూపరింటెండెంట్ సుబ్బారెడ్డి, నీలకంటేశ్వర రాజు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## శ్రీశైలంలో తప్పిపోయిన ఆదోని బాలిక..

**: ఆచూకీ కోసం పోలీసుల ఎదురుచూపు!**
**: చిన్నారి ధరణిని తన తల్లిదండ్రుల వద్దకు చేరుద్దాం ..**

**శ్రీశైలం ప్రభాతవార్త ఫిబ్రవరి 14 :**
కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన 8 ఏళ్ల ధరణి అనే బాలిక శ్రీశైలం క్షేత్రంలో తప్పిపోయింది. ప్రస్తుతం ఆ చిన్నారి శ్రీశైలం పోలీస్ కంట్రోల్ రూమ్లో రక్షణలో ఉంది. తన తల్లిదండ్రుల పేర్లు చౌడమ్మ, తిక్కయ్య అని, తాము ఆదోని నుంచి వచ్చామని పాప చెబుతోంది. ధరణి తల్లిదండ్రులు గానీ, లేదా ఆ పాపను గుర్తించిన బంధుమిత్రులు గానీ వెంటనే శ్రీశైలం పోలీసులను సంప్రదించాలని పోలీసులు కోరారు.



# వైద్య ఆరోగ్యానికి పెద్ద పీఠం

**కర్నూలు సిటీ, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త :**
కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రవేశపెట్టిన మూడవ బడ్జెట్‌పై బిజెపి ఆదోని అసెంబ్లీ కో కన్వీనర్ నాగరాజు గౌడ్ స్పందిస్తూ, ఈ బడ్జెట్ పేదలు, రైతులు, మహిళలు, బీసీ, ఎస్టీ వర్గాలను కేంద్రంగా చేసుకుని రూపుదిద్దుకుందని తెలిపారు. విద్య, వైద్యం, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, జలవనరులు, రహదారులు మరియు మహిళా సాధికారతపై ప్రత్యేక దృష్టి పెట్టిన సమగ్ర బడ్జెట్‌గా అభివర్ణించారు. వారసత్వంగా వచ్చిన అప్పుల భారాన్ని తగ్గించేందుకు ద్రవ్య లోటు, రెవెన్యూ డెఫిసిట్, ఫిస్కల్ డెఫిసిట్‌లను నియంత్రణలో పెట్టే దిశగా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. 202425లో 5.11 ఉన్న ఫిస్కల్ డెఫిసిట్‌ను



4.57 కు, ఇక ప్రస్తుత బడ్జెట్‌లో 3.84 కు తగ్గించే లక్ష్యాన్ని నిర్దేశించిందని పేర్కొన్నారు. రెవెన్యూ డెఫిసిట్‌ను కూడా 2.33 నుంచి 1.88 కు తగ్గించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. గతంలో నిర్వీర్యమైన 83 కేంద్ర ప్రాయోజిత పథకాలను పునరుద్ధరించి, దాదాపు.. 24,000 కోట్ల కేటాయింపులతో కేంద్రం నుంచి సుమారు 60 నిధులను రాబట్టే అవకాశాన్ని సృష్టించామని తెలిపారు.గ్రామీణాభివృద్ధి కోసం ప్రతిష్టాత్మక విబి రామ్జి పథకానికి సుమారు.. 9,000 కోట్లు కేటాయించడం జరిగిందని, జలజీవన్ మిషన్, పేదల గృహనిర్మాణం వంటి పథకాలలో 60:40 నిష్పత్తిలో కేంద్ర నిధులు పొందేందుకు బడ్జెట్ అనుకూలంగా రూపొందించబడిందని చెప్పారు. రేర్ ఎర్త్ మినరల్స్, సిటీ ఎకనామిక్ జోన్లు, ఇతర కేంద్ర ప్రయోజన పథకాలతో అనుసంధానం చేసుకుని రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి ఈ బడ్జెట్ దోహదం చేస్తుందని అభిప్రాయపడ్డారు. ఐదు ఆరు సంవత్సరాలుగా నిలిచిపోయిన అభివృద్ధి పనులను పునరుద్ధరించేందుకు ఈ ఆర్థిక సంవత్సరంలో దాదాపు ..36,000 కోట్ల మూలధన వ్యయం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు.ప్రజారోగ్యానికి ఈ బడ్జెట్‌లో ప్రత్యేక ప్రాధాన్యం కల్పించబడిందని మంత్రి గారు స్పష్టం చేశారు. మొత్తం బడ్జెట్‌లో 5.88 ఆరోగ్య శాఖకు కేటాయించడం జరిగిందని, ఇది గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 9.5 అధికమని, 2023 24తో పోలిస్తే సుమారు 30 పెరుగుదల సాధించామని తెలిపారు. క్యాపిటల్ ఎక్స్పెండిచర్ కింద ..3,066 కోట్లు కేటాయించి, గత సంవత్సరంతో పోలిస్తే ..1,000 కోట్లు అదనంగా పెట్టుబడి పెట్టామని వెల్లడించారు. ప్రివెంటివ్ హెల్త్‌కేర్ కోసం "సంజీవని" వంటి కార్యక్రమాలు, యూనివర్సల్ హెల్త్ కవరేజ్ అమలు, ఎన్టీఆర్ వైద్యసేవ కింద ..4,000 కోట్ల కేటాయింపులు ఇవన్నీ కూటమి ప్రభుత్వానికి పేదల ఆరోగ్యం పట్ల ఉన్న చిత్తశుద్ధిని స్పష్టంగా చూపిస్తున్నాయని ఆయన అన్నారు.

## భారీ అంచనాలతో.. బడ్జెట్..!

**(మొదటి పేజీ తరువాయి ) :** మత్స్యకార సేవకు 600 కోట్లు, ధరల స్థిరీకరణ కు రూ 560 కోట్లు మనబడి మన భవిష్యత్ పథకానికి రూ. 1,500 కోట్లు, పీఎం స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియాకు రూ. 707 కోట్లు, సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర పథకానికి రూ. 654 కోట్లు, యూత్ అండ్ స్పోర్ట్స్‌కు రూ. 438 కోట్లు, సాగు నీటి ప్రాజెక్టులు: రూ. 9,906 కోట్లు, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన: రూ. 1,927 కోట్లు.. అన్నదా సుఖీభవ: రూ. 6,600 కోట్లు, మత్స్యకారులకు రూ. 260 కోట్లు.. పోలవరం: రూ. 6,105 కోట్లు, ధరల స్థిరీకరణ నిధి: రూ. 500 కోట్లు.. పాఠశాల విద్యకు రూ. 32,308 కోట్లు, వైద్య ఆరోగ్య శాఖకు రూ. 19,306 కోట్లు.. బీసీ సంఘాల కోసం రూ. 23,650 కోట్లు.. జల వనరుల శాఖకు రూ. 18,223 కోట్లు.. పంచాయతీ రాజ్ కు రూ. 22,941 కోట్లు, మున్సిపల్ శాఖకు రూ. 14,538 కోట్లు.. గా కేటాయించారు. రాయలసీమ అభివృద్ధి కొరకు వచ్చే మూడేళ్లలో 41,0000 కోట్ల ఆర్థిక సహాయం అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర ఆర్థిక మంత్రి నీ కోరారు. ఉద్యానవన ప్రాజెక్ట ల కోసం కేటాయించిన నిధులలో సుమారు 9,000 కోట్లను రైతులకు సబ్సిడీ రూపంలో అందిస్తున్నట్లు తెలిపారు. రాయలసీమ ఉద్యానవన సాగును పెంచడానికి హంద్రీ నివా నీటిని ఉపయోగించనున్నట్లు తెలిపారు.రాయలసీమ మరియు ప్రకాశం జిల్లాలో జిల్లాలో కలిపి సుమారు 50 లక్షల ఎకరాలలో ఉధ్యానవన సాగును లక్ష్యంగా పెట్టుకుంది. 200 లక్షల మెట్రిక్ టన్నుల ఉద్యానవన ఉత్పన్నులను పెంచి కొత్త పథకం ద్వారా ఈ ప్రాంతాన్ని ప్రపంచ స్థాయి హబ్ గా తీర్చిదిద్దుతాం అని ప్రభుత్వం ప్రకటించింది. ఇదిలా ఉండగా కర్నూలు జిల్లాలో పెండింగ్ లో ఉన్న సాగు నీటి ప్రాజెక్టులైన వేదవతి, గుండ్రేవుల ఆర్డీఎస్ కుడి కాలువ నిర్మాణానికి రాష్ట్ర బడ్జెట్ లో నిధులు కేటాయించకపోవడం జిల్లా కు తీరని అన్యాయం జరిగిందని వామ పక్ష పార్టీలు విమర్శించాయి. జిల్లాలో నూతన పరిశ్రమలు స్థాపించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశాయి.

## సెలవుల్లో పన్ను వసూళ్లు యథాతథం

**కర్నూలు మున్సిపల్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:** సెలవురోజుల్లో కూడ పన్ను వసూళ్ళను యథావిధిగా కొనసాగుతున్నాయని మేనేజరు చిన్నరాముడు పేర్కొన్నారు. నగరంలోని వెంకటరమణ కాలనీలోని తాత్కాలిక నగరపాలక కార్యాలయంలో పన్ను వసూళ్ళ కేంద్రాన్ని ఆయన పరిశీలించి అక్కడి ఏర్పాట్లు, సిబ్బంది పనితీరును పరిశీలించారు. పన్ను చెల్లింపుదారులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన మాట్లాడుతూ పన్ను చెల్లింపులు నగరాభి వృద్ధికి కీలకమని ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ బకాయిలను చెల్లించాలని కోరారు. సెలవు దినాల్లో కూడ కేంద్రం పనిచేయడం ద్వారా ప్రజలకు సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు.

## శైవ క్షేత్రాలు ముస్తాబు..

**- భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు**



**బండిఆత్మకూరు, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:** ఓం.నమశివాయ అనే శబ్దంతో నేటి నుండి బండి ఆత్మకూరు మండలంలోని శైవక్షేత్రాలైన ఓంకారం, శివనంది, కృష్ణనంది దేవస్థానాలు శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముస్తాబయ్యాయి. దైవదర్శనం కోసం వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఛైర్మన్‌లు అల్లె చెన్నారెడ్డి, పల్లె తిరుపం రెడ్డిలు తెలిపారు. ఆలయ అధికారులు నాగప్రసాద్, వేణునాధరెడ్డిల ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నాఉ. నేటి నుంచి 18వ తేదివరకు శైవక్షేత్రాల్లో దైవదర్శం కోసం రాష్ట్ర నలుమూలల నుండి వేలాది సంఖ్యలో భక్తులు తరలివస్తారు. వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్నివసతులు అధికారులు ఏర్పాటు చేశారు. **భక్తుకు అసౌర్యాలు కలుగకుండా చర్యలు తీసుకోండి:** శైవక్షేత్రాల్లో జరిగే మహాశివ రాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చర్యలు తీసుకో వాలని దేవాదాయశాఖ కర్నూలు డిప్యూటి కమిషనర్ పట్టెం గురుప్రసాద్ అన్నారు.శనివారం ఆయన ఓంకారక్షేత్రం సందర్శించారు. ఆలయంలో ఏర్పాటు చేసిన పలు సౌకర్యాలను ఆయన పరిశీలిం చారు. ముఖ్యంగా తాగునీరు. శానిటేషన్‌పై దృష్టిసారించాలన్నారు. జిల్లా దేవాదాయశాఖాధికారి మోహన్, డివిజన్ తనిఖీ అధికారి హరిచంద్రారెడ్డి, ఫెస్టివల్ ఆఫీసర్ జనార్ధన్, ఆలయ అర్చకులు చక్రపాణి శర్మ పాల్గొన్నారు.

## అడవులు వన్యప్రాణుల సంరక్షణ మనందరి బాధ్యత



**బండిఆత్మకూరు, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:** మండలంలో ఉన్న శైవక్షేత్రాలన్ని నల్లమల అటవీప్రాంతంలో ఉన్నాయి కాబట్టి అడవులు అందులో ఉన్న వన్యప్రాణాల సంరక్షణ మనందరి బాధ్యత అని బండిఆత్మకూరు అటవీశాఖ అధికారి నసీర్ ఝా అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా నల్లమల అభయారణ్యంలో ఉన్న పుణ్యక్షేత్రాలకు వెళ్లె తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మండలంలోని గుండ్ల బ్రహ్మేశ్వరం, ఓంకారం, కృష్ణనంది, శివనంది తదితర శైవక్షేత్రాలు దట్టమైన అడవుల్లో ఉండడం వల్ల వన్యప్రాణుల సంచారం ఉంటుందని ఈనేపథ్యంలో భక్తులు గుంపులుగా వెళ్లాలని తెలిపారు. అడవిలో అగ్నిప్రమాదాల వల్ల వృక్షసంపదతో పాటు వన్యప్రాణులకు తీవ్ర నష్టం కలుగుతుందని అగ్గిపెట్టెలు, నిప్పు సామాగ్రి అడవిలోకి తీసుకొని వెళ్లరాదన్నారు. కాలినడకన నారాయణపురం నుండి గుండ్ల బ్రహ్మేశ్వరం వెళ్లె భక్తులకు ట్యాంకర్ల ద్వారా తాగునీటి సౌకర్యంఉంటుందన్నారు. ఏది ఏమైనా ఉత్సవాలకు వెళ్ల భక్తులుఅటవీశాఖ నిబంధనలుపాటించి జాగ్రత్తగా దైవదర్శనం చేసుకోవాలన్నారు.

## పోలీసు వారి సూచనలు పాటించాలి



**నందవరం, ఫిబ్రవరి 14,ప్రభాతవార్త:** మహాశివరాత్రి సందర్భంగా గురజాల రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు పురస్కరించుకొని వచ్చు భక్తులు పోలీసు వారి సూచనలు తూచ తప్పకుండా పాటించాలని నందవరం స్టేషన్ అధికారి తిమ్మారెడ్డి అన్నారు. శనివారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేస్తు సూచనలు జారీచేశారు. నాగలదిన్నె, రాయచోటి గ్రామాల వైపు నుండి వచ్చిన వాహనాలు గురుజాల గ్రామ శివారులో ఏర్పాటు చేసిన వాహనాల నిలుపు ప్రాంగణంలో నిలపాలన్నారు. దేవాలయ దర్శనానికి వచ్చు భక్తులు దేవాలయంలో ఏర్పాటు చేసిన క్యూలైన్లలో మాత్రమే దర్శించుకోవాలన్నారు. భక్తులు బయటకు వెళ్లే దారిలో ఏ ఒక్కరు కూడ దైవదర్శనానికి వెళ్లకూడదన్నారు. తుంగభద్ర నదిలో స్నానం అచరించే భక్తులు నదిలోపడికి వెళ్లకూడదని నీటి ప్రవాహం ఎక్కువగా ఉందని సూచనలు అందజేశారు. ప్రతిఒక్కరు తమ ఖరీదైన వస్తువులను వాహనాలకు వారే జాగ్రత వహించాలన్నారు. భక్తుల రద్దీలో కొత్తవ్యక్తుల మాటలను నమ్మబలికి మోసపోవద్దన్నారు. రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు పోలీస్ వారు పటిష్ట భద్రత ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

## ప్రధాన రహదారికి మర్మత్తులు చేయండి



**గోనెగండ్ల, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన గోనెగండ్ల,గంజహళ్లి ప్రధాన రహదారి గుంతమయంగా మరింది.వాహనాల రాక పోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉంది.కావున ఆర్‌అండ్‌బీ అధికారులు రహదారికి మర్మత్తు చేయాలని గోనెగండ్ల,గంజహళ్లి గ్రామాల ప్రజలు కోరుతున్నారు.పలు మార్లు ఉన్నతాధికారులకు విన్నవించినప్పటికి ఫలితం కనిపించలేదని గ్రామాల ప్రజలు వాపోతున్నారు.దారి మధ్యంలో ఐయ్యకొండ గ్రామం క్రాస్ రోడ్డు దగ్గర కూడా గుంత పడటంతో ఆ గ్రామానికి కూడా వెళ్లేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తుందని గ్రామస్థులు తెలుపుతున్నారు.గత కొన్ని మాసాలుగా గుంతలు పడిన రోడ్డు వెంట వాహనాలు వెళ్లేందుకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.దాదాపు ఇప్పటికి 20 నుంచి 30 రోడ్డు ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి,గోనెగండ్ల నుంచి గంజహళ్లికి 10 నిమిషాలలో వెళ్లే ప్రయాణం గుంతల మయం కారణంగా అరగంట పైగానే పడుతుందని వాహనాదారులు తెలుపుతున్నారు.మరో 10 రోజులలో గంజహళ్లిలో బడేసాబ్ ఉరుసు జరగనుంది.రెండు రోజులు జరిగే ఈ ఉరుసుకు దాదాపు 2.50 లక్షల మంది జనం హజరవుతారు.రోడ్డు గుంతల మయంగా ఉంటే రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.కావున సంబందిత అధికారులు స్పందించి రోడ్డుకు మర్మత్తు చేపట్టాలని ఇరు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## ఆదోని క్రీడలతోనే శారీరక శ్రమ మానసిక ఉల్లాసం



**ఆదోని క్రైమ్, 14 ఫిబ్రవరి, ప్రభాతవార్త:** ఆదోని క్రీడలతోనే శారీరక శ్రమ మానసిక ఉల్లాసం పెంపొంది ఉత్సాహంగా ఉంటామని టూ టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి పారిశ్రామికవేత్త విట్టా రమేష్ తెలిపారు శనివారం మున్సిపల్ మైదానంలో ఫ్రెండ్షిప్‌కప్ క్రికెట్ టోర్నమెంట్ లో బ్యాటింగ్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు అంతకుముందు టోర్నమెంట్ ఆర్గనైజర్ ముజీబ్ అహ్మద్ తో కలిసి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు ముందుగా పోలీసులు సచివాలయ ఉద్యోగులు మధ్య క్రికెట్ టోర్నమెంట్ మొదలైంది వారు మాట్లాడారు పరస్పర సంబంధాలు ఏర్పడి స్నేహ సంబంధాలు పెంపొందుతాయన్నారు తరచుగా ఇలాంటి టోర్నమెంట్లు నిర్వహిస్తూ క్రీడ నైపుణ్యత ప్రదర్శనకు వేదికగా ఉండడం అభినందించదగ్గ విషయమని నిర్వాకుడు ముజీబ్ హమ్మద్ సేవలను కొనియాడారు ఆర్గనైజర్ ముజీబ్ అహ్మద్ మాట్లాడుతూ ఈనెల 16వ తేదీ వరకు క్రికెట్ టోర్నమెంట్ ఉంటుందని 16 జట్లు ఆడుతాయన్నారు చివరి రోజు టోర్నమెంట్ కప్పుతోపాటు నగదు విన్నర్ ,రన్నర్ జట్లకు అందజేస్తామని తెలిపారు కార్యక్రమంలో శ్రీనివాసులు కలందర్ సాయిరాం ఉన్నారు.

## వీర జవాన్లకు ఘన నివాలి



**పాములపాడు, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:** పుల్వామా దాడితో అమరులైన వీర జవాన్లకు పాములపాడు మండల కేంద్రంలో వైసీపీ నాయకులు వెంకటేశ్వర్లు, మున్నా, వివిధ ప్రజా సంఘాల నాయకులు మహమ్మద్ గనీ, వెంకటేశ్వర్లులు ఘననివాళి అర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పుల్వామాదాడిలో దేశం కోసం ప్రాణాలర్పించిన వీర జవాన్ల త్యాగాలను భారతీయులు ఎప్పటికి మరిచిపోరని వారి త్యాగాన్ని భారతీయులు చిరస్థాయిగా గుర్తుంచుకుంటారని అమరులైన వీర జవాన్లకు శాంతి కలగాలని వారు ఆకాంక్షించారు.

## బహిరంగ మలమూత్ర విసర్జన రహితనగరంగా తీర్చిదిద్దుదాం

**బేతంచెర్ల, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:** బేతంచెర్ల నగర పంచాయితీని బహిరంగ మలమూత్ర విసర్జన రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరు ముందుకు రావాలని మున్సిపాలిటి కమిషనర్ హరిప్రసాద్ శనివారం పిలుపునిచ్చారు. సర్వేక్షన్ 2025-26లో భాగంగా ఓడిఎఫ్ ప్లస్ ప్లస్ నగరంలో తీర్చిదిద్దేడంలో భాగంగా బహిరంగ మలమూత్ర విసర్జన చేస్తే చర్యలు తప్పవు అన్నారు. బహిరంగ మలవిసర్జన చేస్తే రూ.100లు జరిమాన. మూత్ర విసర్జన చేస్తే రూ.50లు జరిమాన ఉంటుందని ప్రజలు గమనించాలన్నారు. వీటిపై ఏవైనా అభ్యంతరాలుంటే 15 రోజుల్లో తెలియజేయాలన్నారు. ప్రతిఒక్కరు ఆరోగ్యవంతంగా ఉండాలంటే ఈలక్ష్యసాధనలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## లింగందిన్నెకు చేరిన అహోబిల పార్వేట పల్లకీ



**రుద్రవరం, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:** అహోబిల లక్ష్మీనరసింహ స్వామి పార్వేట ఉత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని టి లింగందిన్నె గ్రామానికి చేరుకున్నారు. శుక్రవారం తిప్పారెడ్డి పల్లె నుంచి అహోబిల లక్ష్మీనరసింహాస్వామి ఉత్సవ మూర్తుల పల్లకీ లింగందిన్నె గ్రామ పొలిమేర వద్దకు చేరుకోగానే గ్రామపెద్దలు, అధికారులు మేళతాళాలతో ఎదురేగి స్వామివారి పల్లకీని గ్రామంలోకి తీసుకువచ్చారు. ఉత్సవమూర్తుల పల్లకీ గ్రామంలోని ముస్తాబుచేయబడిన పలు తెలుపులపై కొలువుదీరడంతో స్వామివారికి గ్రామస్థులు ప్రత్యేకపూజలు చేశారు. స్వామివారి రాకతో గ్రామంలో తిరునాల సందడి బంధువుల రాకతో గ్రామం కిక్కిరిసిపోయింది. గ్రామంలో తిరునాల వాతావరణం నెలకొనడంతో గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ జయప్ప పోలీస్‌బందోబస్తు నిర్వహించారు.

## దామోదర సంజీవయ్యకు ఘన నివాళి



**బేతంచెర్ల, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మొట్టమొదటి దళిత ముఖ్యమంత్రి దామోదర సంజీవయ్య జయంతి సందర్భంగా శనివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయం, ఆర్ అండ్ బి గెస్ట్‌హౌస్ నందు పలువురు నాయకులు ఘనంగా నివాళ్లు అర్పించారు. ముందుగా దామోదర సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించిన నాయకులు మాట్లాడుతూ దామోదరం సంజీవయ్య నిజాయితీకి మారుపేరని వారు కొనియాడారు. అలాగే భూ పంపిణి విధానానికి నాంది పలికిన నాయకుడని ఏసీబీ వ్యవస్థను స్థాపించిన వ్యక్తి అని ఆయన నేటి నాయకులకు స్ఫూర్తిదాయకమన్నారు. నేటి పాలకులు దామోదరం సంజీవయ్యపాలన విధానాలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అయా కార్యక్రమాల్లో టీడీపీ క్రిస్టియన్ సెల్ నాయకులు మేకల నాగరాజు, మాదవ కృష్ణ, కానాల అంజి, పలువురు నాయకులు, కార్యకర్తలు, మాలమహానాడు రాయలసీమ అధ్యక్షులు బొల్లి మద్దిలేటి, రామసుబ్బయ్య పాల్గొన్నారు.

## నివాళ్లు అర్పించిన టీడీపీ నాయకుడు



**కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:** కొలిమిగుండ్ల మండల కేంద్రంలోని అంకిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన బండ నాగాంజనేయులు శుక్రవారం రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన నాగాంజనేయులును అవుకు ప్రభుత్వాసు పత్రిలో ఉండగా విషయం తెలుసుకున్న గ్రామ టీడీపీ నాయకులు నంద్యాల నారాయణరెడ్డి అవుకు ప్రభుత్వాసు వద్దకు వెళ్లి బండ నాగాంజనేయులు పార్థివదేహానికి నివాళ్లు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చి నాగాంజనేయులు కుటుంబానికి టీడీపీ పార్టీ,మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి అండగా ఉంటారని మృతిచెందిన బండ నాగాంజనేయులు మృతి మాకెంతో బాధకలిగిందని కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈయన వెంట ఈశ్వర్‌రెడ్డి, గ్రామ వడ్డే సోదరులు పాల్గొన్నారు.

## ఘనంగా దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలు



**పాములపాడు, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:** మాజీ తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య 105వ జయంతి వేడుకలను ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మాలమహానాడు రాయలసీమ అధ్యక్షులు కలబండి అంకన్న, జిల్లా ఎస్సీ,ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు నాగరాజు, సిపిఎం మండల కార్యదర్శి మేకల రాజులు సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. వారు మాట్లాడుతూ దేశంలో మొట్టమొదటి దళిత ముఖ్యమంత్రి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఎనలేని సేవలు అందించారన్నారు. నిజాయితీగా, నిస్వార్థంగా ఎలాంటి సంపద లేకుండా ముఖ్యమంత్రిగా సేవలందించారన్నారు. అంతేకాకుండా ఏఐసీసీ జాతీయ ఉపాధ్యక్షుడిగా, కేంద్రమంత్రిగా పనిచేశారని పేర్కొన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షులు షేక్షావలి, రజకసంఘం నాయకులు రామకృష్ణ, కార్మికసంఘం నాయకులు నాగేశ్వరుడు, మల్లిఖార్జున, బీసీ సంఘం నాయకులు సాయికృష్ణ, పాయిత్రికేయులు గోవిందు, శ్రీకాంత్, షరుద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

## కే జి ఆర్ డిగ్రీ కళాశాలలో పెరెవల్ డే



**బనగానపల్లె, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:** పట్టణంలోని కంకర గురెడ్డి డిగ్రీ కళాశాల నందు శనివారం పెరెవల్ పార్టీ సెలబ్రేషన్స్ డే సందర్భంగా ముఖ్యఅతిథిగా కళాశాల కరస్పాండెంట్ కే.రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపల్ సదా శివ మూర్తి రేగటి రామకృష్ణా రెడ్డి హైదరాబాదు నుంచి వచ్చిన యోగ ధ్యానం మాస్టర్ మట్ట మనోహర్ ఉపాధ్యాయుడు ప్రభాకర్ రెడ్డి ఉపాధ్యాయ బృందం విద్యార్థిని విద్యార్థులు పెరెవల్ డే ను ఘనంగా జరుపుకున్నారు. కే జి ఆర్ విద్యాసంస్థల అధినేత కే రామచంద్రారెడ్డి మాట్లాడుతూ విద్యార్థి విద్యార్థినీలు కష్టపడి చదువుకుని తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు కళాశాలకు మంచి పేరు తేవాలని అన్నారు. కళాశాల ప్రిన్సిపల్ శివానందమూర్తి మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి విద్యార్థినీలు క్రమశిక్షణతో మెలిగి వచ్చే పరీక్ష ఫలితాల్లో మంచి మార్కులు తెచ్చి కేజిఆర్ కళాశాలకు మంచి పేరు తేవాలని తెలిపారు. ప్రిన్సిపల్ రేగటి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ కెజిఆర్ జూనియర్ కళాశాల 2005లో కీర్తిశేషులు కంకర గురెడ్డి స్థాపించడం జరిగింది. యోగ ధ్యానం మాస్టర్ మట్ట మనోహర్ హైదరాబాదు నుంచి కళాశాల పెరెవల్ డే కార్యక్రమంకు విచ్చేయడం జరిగింది. మట్ట మనోహర్ మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి విద్యార్థినీలు ముందుగా ధ్యానం చేయాలని తెలిపారు యోగా ధ్యానం వలన వివేకానంద స్వామి ఎన్నో అద్భుతాలు సృష్టించారని తెలిపారు. అనంతరం కళాశాలలో ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఐక్యంగా పోరాడుదాం..! ఆరోగ్య హక్కును సాధిద్దాం..!



**ఆదోని విద్య, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:** సిపిఐ రాష్ట్ర పార్టీ మేరకు ఈరోజు స్థానిక పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద ఆ పార్టీ శ్రేణులు సమావేశం నిర్వహించి రాష్ట్రంలోని మెడికల్ మాఫియా కు వ్యతిరేకంగా ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు ఇది రాజకీయ పోరాటం కాదని ప్రజల ఆరోగ్య హక్కును కాపాడడానికి చేస్తున్న పోరాటమని రాజ్యాంగం ఇచ్చిన ప్రతి పౌరుడి హక్కు అని రాష్ట్ర ప్రభుత్వాలు ఈ హక్కును కాలరాస్తుందని అన్నారు చిన్న ఆపరేషన్ అంటేనే లక్షల లక్షలు హెచ్చించే పరిస్థితులు ఉన్నాయని ఒక్కరకు రా ని టెస్టులు మందులపై భారీ దోపిడీ ప్రైవేట్ ఆస్పత్రులు చేస్తున్నాయని ఆసుపత్రిలో చేరిన రోగి రోగంతో కన్నా వైద్య ఖర్చులు బిల్లులకే సగం చచ్చిపోతున్నాడని వారు తీయబెట్టారు ఇది వైద్య సేవ కాదు మాఫియా దందా అని కార్పొరేటర్ ఆసుపత్రుల్లో స్కాన్లు ఐసీయూలు అంటూ అవసరం ఉన్న లేకున్నా లక్షల లక్షలు బిల్లులు వసూలు చేస్తున్నారని దీంతో పేదవాడికి ఆరోగ్యం అందని ద్రాక్ష అయిందని అన్నారు ఫార్మా కంపెనీలతో మందుల మాఫియా కుమ్మక్కై మందులను అధిక ధరలకు విక్రయిస్తున్న పట్టించుకునే నాధుడే లేదని వాపోయారు పేద ప్రజలను దోచుకుని వారిని అప్పుల పాలు చేస్తున్నారని ప్రజల ప్రాణాలతో చేసే వ్యాపారాన్ని సిపిఐ సహించదని ప్రభుత్వ ఆసుపత్రులను బలోపితం చేసి ప్రవేట్ ఆసుపత్రులను నియంత్రణలో ఉంచు కోవాల్సిన ప్రభుత్వాలు ప్రవేట్ ఆసుపత్రులకు వత్తాసు పలకడం సూచనీయమని వారు అన్నారు ప్రతి పేద కుటుంబానికి ఉచిత వైద్యం అందించాల్సిన బాధ్యత ప్రజా ప్రభుత్వాలదేనని లేనియెడల భవిష్యత్తులో ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాన్ని చేస్తామని సిపిఐ పార్టీ తెలిపింది.

## హర హర మహాదేవ.. శంభో శంకర..!

**(మొదటి పేజీ తరువాయి ) :** ప్రతి చాంద్రమాసంలోని 14వ రోజు లేదా అమావాస్యకు ముందు వచ్చే రోజుని శివరాత్రి అంటారు,,కానీ పంచాంగ సంవత్సరంలో వచ్చే పన్నెండు శివరాత్రుల్లో ఫిబ్రవరి లేదా మార్చి నెలల్లో వచ్చే శివరాత్రికి అత్యంత ప్రాముఖ్యత ఉంది.. ఆధ్యాత్మికంగా ఎంతో శక్తివంతమైనది.. మహాశివరాత్రి రోజు భూమి ఉత్తర అర్ధగోళం ఎటువంటి స్థితిలో ఉంటుందంటే మనిషిలోని శక్తిసహజంగానే ఉప్పొంగుతుంది.. శివరాత్రి నాడు ప్రకృతి ఆధ్యాత్మిక శక్తివైపు ప్రయాణింపజేస్తుంది.. మహాశివరాత్రి రోజు తెల్లవారే వరకూ జాగారం చేసి పరమశివుడ్ని భజిస్తారు.. కుటుంబ జీవితానికి, ఆధ్యాత్మిక జీవితానికి సమన్వయం సాధించే రోజు మహాశివరాత్రి..కుటుంబంలో నివసించే వారికి మహాశివరాత్రిని పరమశివుని కళ్యాణ రోజుగా భావిస్తే, ప్రాపంచిక లక్ష్యాల్లో ఉన్నవారు శివరాత్రి నాడు శివుడు తన శత్రువులను జయించిన రోజుగా భావిస్తారు..కానీ, సన్యాసాశ్రమంలో ఉన్న వారికి శివయ్య ఈ రోజు పరిపూర్ణ నిశ్చలత్వంతో పర్వతంలా అయిపోయిన రోజు,.యోగ శాస్త్రానికి మూలకారకుడు పరమశివుడు, ధ్యానానికి వేల సంవత్సరాల నుంచి ప్రతీకగా నిలిచిన ఆదిగురువు,, ఇక శివుని దేవేరి పార్వతీదేవీల వివాహ మహోత్సవం జరిగిన రోజుని మహాశివరాత్రిగా పెద్ద ఎత్తున హిందువులు పండుగ జరుపుకుంటారు.. శివయ్య లింగాకారంలో ఆవిర్భవించన రోజని ఈ రోజును గురించి శివపురాణం తెలుపుతుంది..

**లింగోద్భవ ప్రాశస్త్యం:** సృష్టికర్త బ్రహ్మ, స్థితికారుడు శ్రీమహావిష్ణువుకు తమలో ఎవరు గొప్ప అనే సంవాదం వస్తుంది..ముక్కోటి దేవతల్లో తామే గొప్ప అని ఎవరికి వారు పోటీపడుతారు.. చివరకు తమ వాదన తీర్చమని లయకారుడు మహాశివుడ్ని కోరుతారు.. ఆయన తన రూపంలో ఆద్యంతాలను ఎవరు గుర్తిస్తారో వారే గొప్పవారని చెబుతాడు.. దీంతో బ్రహ్మ విహంగ రూపంలో, విష్ణువు వరాహావతారంలో బయలు దేరుతారు. పరమేశ్వరుడి ఆదిని గుర్తించేందుకు విష్ణువు, అంత్యభాగాన్ని కనుగొనేందుకు బ్రహ్మ వెళ్తారు..ఎంత ప్రయత్నించినా లయకారుడి ఆద్యంతాలను గుర్తించలేక ఆయన్నే ఆశ్రయిస్తారు.. కరుణించిన పశుపతి శివలింగ రూపంలో తన విశ్వరూప దర్శనాన్ని అనుగ్రహిస్తాడు.. బ్రహ్మ విష్ణువులకు శివుడు విశ్వరూప దర్శన భాగ్యం కల్పించిన రోజునే మహాశివరాత్రి.. ఆయన మహాశివలింగంగా ఆవిర్భవించిన సమయంలో నిర్వహించేదే లింగోద్భవాభిషేకం.. శివరాత్రి పర్వదినంలో ఆలయ ప్రధానార్చకులు స్వామి వారికి 11 కాలాల్లో అభిషేకాలు నిర్వహిస్తారు.. వాటిలో 11వ కాలంలో లింగోద్భవాభిషేకం జరుగుతుంది.. ఈ లింగోద్భవాభిషేకాన్ని తిలకించిన వారికి సర్వపాపాలు తొలగి మోక్షం లభిస్తుందని పురాణ ప్రతీతి..

**బిల్వ పత్రం శివునికి ప్రీతికరం:** శివునికి ప్రీతికరమైనది బిల్వ పత్రం.. అంటే మారేడు దళం.. త్రిగుణాకర స్వరూపమైన బిల్వ పత్రం శివుని పూజకు విశేషమైనది.. మారేడు దళములతో శివుని పూజించడం వల్ల సర్వాభీష్టాలు నెరవేరుతాయని పురోహితులు తెలుపుతున్నారు.. మూడు జన్మల్లో చేసిన పాపాలు తొలగించే శక్తి మారేడు దళానికి ఉంటుందని పురాణాలు చెబుతున్నాయి..

**మహాశివరాత్రికి సిద్ధం:** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాలోని పలు ప్రాంతాల్లో గల శివాలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి.సులువుగా దర్శనమయ్యేలా ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు వంటివి నిర్వహకులు ఏర్పాటు చేసారు.. శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రముఖ శైవ క్షేత్రమైన శ్రీశైలంలో జ్యోతిర్లింగ స్వరూపుడైన మల్లికార్జున స్వామి, భ్రమరాంబాదేవి సమేతంగా పూజలను అందుకునేందుకు ఆలయాల నిర్వహకులు అన్ని ఏర్పాట్లు సి ద్ధం చేసారు..

## థాంక్యు సిఎం సార్



**చాగలమర్రి, ఫిబ్రవరి 14,ప్రభాతవార్త:** ఇచ్చిన హామిని అమలుచేసినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఎల్లవేళల రుణపడి ఉంటామని 108 సిబ్బంది తెలిపారు.108 అంబులెన్స్ సర్వీసుల్లో ఉద్యోగులుగా ఈఎంటీ పైలెట్లకు జీతాలు పెంచడంతో వారు హార్షం వ్యక్తంచేశారు. శనివారం 108 వాహనం ఎదురుగా థ్యాంక్యు సీఎం సారు అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. వారు మాట్లాడుతూ చంద్రబాబు నేతృత ం లోని కూటమి ప్రభుత్వం ఇప్పటికే ఉన్న తమ జీతానికి అదనంగా రూ.2 వేలు పెంచారని అలాగే ఐదు, పది ఏళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న ఉద్యోగులకు ఆటోమేటిక్ క్లాబ్ అఫ్ గ్రేడేషన్ తీసుకున్న నిర్ణయంతో తమకు ఆర్థిక వెసులుబాటు ఉంటుందని ఆయన ఎల్లవేళల రుణపడి ఉంటామన్నారు. 108 సిబ్బంది వెంకటేశ్వర్‌రెడ్డి, మద్దిలేటి రెడ్డి, శ్రీరాములు, బ్రహ్మనందరెడ్డి, జీవన్ పాల్గొన్నారు.

## మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైన శైవక్షేత్రాలు

**బేతంచెర్ల, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:** పట్టణంలోని ప్రముఖ శైవక్షేత్రం ముచ్చట్ల మల్లికార్జునస్వామి ఆలయంతోపాటు పలు శైవక్షేత్రాలు మహాశివరాత్రి వేడుకలకు సిద్దమయ్యాయి. మహాశివరాత్రి వేడుకల సందర్భంగా ముచ్చట్ల మల్లిఖార్జునస్వామి ఆలయంలో 15న రాత్రి లింగోద్భవ అనంతరం కళ్యాణమహోత్సవం ఉంటుందన్నారు. అలాగే వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఈవో తెలిపారు. ఎంబాయిలో వెలిసిన భోగేశ్వరస్వామి, బుగ్గానిపల్లెలో కొలువైన బ్రహ్మసూత్ర నాగలింగేశ్వరస్వామి పట్టణంలోని సిద్దేశ్వరస్వామి పూదోట ఆశ్రమంలో మహాశివరాత్రి వేడుకలు నిర్వహించేందుకు అన్ని విధాల నిర్వాహకులు సిద్దమయ్యారు.

## శివరాత్రికి ముస్తాబైన శివాలయాలు



**చాగలమర్రి, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:** శివరాత్రి వేడుకలసందర్భంగా మండలంలోని పలు శివాలయాలు ముస్తాబయ్యాయి. చాగలమర్రి సమీపంలో వెలసిన ఉత్సవ మల్లేశ్వరస్వామి మహాశివరాత్రి వేడుకలకు ముస్తాబైంది ఎంతో చారిత్రాత్మక నేపథ్యం ఉన్న ఈ ఆలయంలో శివరాత్రిని పురస్కరించుకొని ఈనెల 15, 16న ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించున్నారు. స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు రాత్రి జాగారం కార్యక్రమం నిర్వహించనున్నారు. మరుసటి రోజు వేదపండితుల మంత్రోచ్ఛరణ మధ్య పార్వతీ పరమేశ్వరుల కళ్యాణం నిర్వహిస్తారు. ఈవేడుకలను తిలకించేందుకు పట్టణంనుంచే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుండి భక్తులుపెద్ద సంఖ్యలో రానుండడంతో దేవస్థానం కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. చింతలచెరువు సమీపంలోని బైరవగుండాల మద్దూరులోని శ్రీబోలాశంకరాలయం, స్థానిక రామలింగేశ్వర, భీమలింగేశ్వర ఆలయాల్లో మండలంలోని పలు గ్రామాల శివాలయాల్లో శివరాత్రి వేడుకలు నిర్వహించి అక్కడికి వచ్చే భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

## ఆల్ ఇండియా ఎరుకల హక్కుల పోరాట సమితి క్యాలెండర్ ఆవిష్కరణ



**ఆదోని క్రైమ్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త :** ఆదోని స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు ఎరుకల రాజు, ఎస్సీ ఎస్టీ , విజిలెన్స్ మానిటీరింగ్ కమిటీ సభ్యులు ఎరుకల రవి ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు ఎరుకల రాజు మాట్లాడుతూ గిరిజనులకు రాజకీయ ప్రాధాన్యత కనిపించాలి మైదాన ప్రాంతంలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలి. ఎరుకల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి. 90/ సబ్సిడీతో రుణాలు ఇవ్వాలి ఐ టి డి ఏ లో ఎరుకల కమ్యూనిటీకి లోన్లు మంజూరు చేయాలి గిరిజనులకు విదేశీ విద్య కల్పించాలి. గిరిజనులను పారిశ్రామికవేత్తగా చేయాలి. రాబోయే బడ్జెట్ గిరిజనులకు 1000 కోట్ల కేటాయించాలి గిరిజనులకు రాబోయే రాజ్యసభ స్థానాలలో అవకాశం కల్పించాలి . రాయలసీమలో ఒక ఎమ్మెల్సీ స్థానం గిరిజన కల్పించాలి. ఎస్సీ ఎస్టీ బ్యాక్లాగ్ పోస్టులు భర్తీ చేయాలి. ఆంధ్రప్రదేశ్లో గిరిజనులపై దాడు ఆపాలి ఆంధ్రప్రదేశ్లో గిరిజనులకు 50 సంవత్సరాలు ఉన్న వారికి పింఛన్లు వెంటనే మంజూరు చేయాలి. కాంట్రాక్టు పనుల్లో గిరిజనులకు 10 లక్షల వరకు నామినేటెడ్ ఇవ్వాలి. ప్రమోషన్లలో గిరిజనులకు సమచిత స్థానం కల్పించాలి. ఈ కార్యక్రమంలో ఆలిండియా ఎరుకుల హక్కుల పోరాట సమితి ఆలూరు తాలూకా ప్రధాన కార్యదర్శి ఎరుకల ఉలిగప్ప హుళగుంద మండలం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎరుకల నాగేషు,ఎరుకల సవారప్ప నాయకులు కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు

## నిప్పంటుకొని గడ్డివాములు దగ్ధం

**బేతంచెర్ల, ఫిబ్రవరి 14,ప్రభాతవార్త:** పట్టణంలో బేగర్‌పేట కాలనీకి చెందిన యల్లకృష్ణ అనే పశువుల పెంపకం దారు గడ్డివాములకు శనివారం నిప్పంటుకొని దగ్ధం అయింది. గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టారో? ప్రమాదవశాత్తు జరిగిందో కానీ గడ్డివాములకు నిప్పంటుకొని మంటలు చేలరేగడంతో కాలనీ వాసులు వాటిని అదుపుచేసేందుకు ప్రయత్నించారు. అయినప్పటికి గడ్డి మొత్తం అగ్నికి అహుతి అవ్వడంతో దాదాపు రూ.30వేలు నష్టం వాటిల్లిందని రైతు వాపోయారు.

# నేడు మహాశివరాత్రి.. ముస్తాబైన శివాలయాలు..!





**పగిడ్యాల, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త :** నేడు మహాశివరాత్రి కావడంతో మండల పరిధిలోని వివిధ గ్రామాలలో ఉన్న శివాలయాలు ముస్తాబయ్యాయి. పగిడ్యాల మండలం బీరవోలు బ్రిడ్జి వద్ద వెలసిన మహిమాన్వితుడైన శ్రీ భీమలింగేశ్వరస్వామి" కొలిచిన వారికి కొంగుబంగారం" భారతదేశంలోని మహా పుణ్యక్షేత్రాలలో సంగమేశ్వర మహాపుణ్యక్షేత్రం ఒకటి. సప్తనదులు ఒకేప్రదేశములో కలయిక వల్ల సప్తనదుల సంగమం అని పేరు. భీమలింగం ఆలయ చరిత్ర గురించి పూర్వీకుల కథనం. పాండవులు ఐదు లింగాలను ప్రతిష్ట చేయాలని తలపెట్టారు. ఈ నేపథ్యంలో ఐదు లింగాలు అవసరమని పురోహితులు ధర్మరాజుకు చెప్పడంతో కాశీకి వెళ్లి శివలింగాలు తెమ్మని భీముడిని ధర్మరాజు ఆదేశించాడు. దీంతో కాశీ నుంచి శివలింగాలు తెస్తున్న సమయంలో ముహూర్త గడియాలు సమీపిస్తుండగా శివలింగాన్ని ప్రతిష్ఠించాలని పండితులు ధర్మరాజుకు చెప్పడంతో తప్పని సరిస్థితిలో వేపమొద్దును ప్రతిష్ఠించారు. ఈ విషయం తెలియడంతో భీముడు ఆగ్రహంతో శివలింగాలను విసిరివేశారు. దీంతో శివలింగాలు మల్లేశ్వరం, సోమేశ్వరం, సిద్ధేశ్వరం, కపిలేశ్వరం, సంగమేశ్వరం ఐదు ప్రదేశాల్లో శివలింగాలు పడ్డాయి. దీంతో నదిలో స్నానాలు మాచరించి భక్తులు భీమలింగానికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆలయంలో వున్న వేపలింగానికి పూజలు చేస్తారని ధర్మరాజు పరిస్థితిని గురించి వివరించడంతో భీముడు శాంతించాడు. ధర్మరాజు ఆజ్ఞ ప్రకారం పూజలు చేయడం ఆనవాయితీగా జరుగుతూరావడం జరిగింది. అయితే శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణం వల్ల సంగమేశ్వరంతోపాటు ఆలయం 1981లో మునిగిపోవడంతో భీమలింగాన్ని 1987 సంవత్సరంలో బీరవోలు బ్రిడ్జి వద్ద భక్తులు ప్రతిష్ఠించడం జరిగింది. దీంతో మహాశివరాత్రి సందర్భంగా సమీప గ్రామాల ప్రజలు అత్యధిక సంఖ్యలో పాల్గొని భీమలింగేశ్వరస్వామి వారలకు ప్రత్యేక పూజలు నిర్వహించడం అనవాయితీగా నాటి నుండి నేటివరకు కొనసాగుతూవస్తుంది. మహాశివరాత్రి సందర్భంగా ఫిబ్రవరి 15 అనగా ఆదివారం జాగరణ, సోమవారం రథోత్సవం, మంగళవారం పారువేట కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## భారతదేశానికి ఘణకీర్తికి కారణం భారతీయ సంస్కృతే



**పగిడ్యాల, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త :** దేశానికి ఘణకీర్తికి కారణం భారతీయసంస్కృతేననీ తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యనిర్వాహకులు డాక్టర్ వేంకటరెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవ స్థానములు హిందూధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యం లో పగిడ్యాల మండలం యం.గణపురంలో వెలసిన శివాలయం నందు ఆధ్యాత్మిక సాంస్కృతిక ఐదవ రోజు కార్యక్రమాలు శనివారం ముగిశాయి. డాక్టర్ వేంకటరెడ్డి మాట్లాడుతూ భారతీయ సంస్కృతికి దూరం కావడమంటే దేశంపట్ల భక్తి లేకపోవడమేననీ అన్నారు. ముక్కోటి దేవతాస్వరూపమైన గోపూజ కుంకమార్చన కార్యక్రమాలను నిర్వహించారు. భారతీయ సంస్కృతి ఔనిత్యాన్ని వివరించారు. శివాలయ అర్చకులు జె.శివరామకృష్ణయ్య, శ్రీరామాలయ అర్చకులు జె.యం.మల్లికార్జున భక్తాదులందరితో గోపూజ కుంకుమార్చన కార్యక్రమాలను వేదక్తంగా నిర్వహించారు. భక్తాదులందరికీ ఆలయ కమిటీ తీర్థప్రసాదాలు అందించారు. ధర్మప్రచార మండలి సభ్యులు అంబటి శివశంకరెడ్డి, సర్పంచ్ ప్రతాపరెడ్డి, ఎల్లయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వీరజవాన్ల ప్రాణాలకు గుర్తుగా రక్తదాన శిబిరం ఏర్పాటు



**గడివేముల, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త;** 2019 ఫిబ్రవరి 14న పూల్వామా ఉగ్ర దాడిలో అశువులు బాసిన వీర జవాన్ల ప్రాణాలకు గుర్తుగా మండలకేంద్రమైన గడివేములలో శనివారం ఏబీవీపీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. గడివేముల పీఏసీఎస్ చైర్మన్ దేశం సత్యనారాయణరెడ్డి, ఏబీవీపీ నందికొట్కూరు కన్వీనర్ భానుప్రకాశ్‌రెడ్డి, తిరుపతి, ఏబీవీపీ మండల కన్వీనర్ భరత సెషన్, జమలుద్దీన్, ధనుంజయ, టీడీపీ యువ నాయకులు దేశం శివనాగిరెడ్డి, షఫీ, సుందర్‌రెడ్డి, సుమంత్, ప్రవీణ్, అబ్దుల్లా, టీడీపీ సీనియర్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ దేశ రక్షణలో ఉన్న భారత జవాన్లను ఉగ్రమూకలు ఆత్మాహుతి దాడి చేసి హత మార్చడం దారుణమన్నారు. వీరజవాన్ల సేవలు మరువలేనివన్నారు. వీరజవాన్ల సేవలను స్మరిస్తూ ప్రతియేటా ఫిబ్రవరి 14న రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి, ఆపదలో ఉన్న వారికి రక్తాన్ని అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రతిఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

## రామకృష్ణ పరమహంస 190 జయంతి మహోత్సవం



**మద్దికెర, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త;** శ్రీ భగవాన్ శ్రీ రామకృష్ణ పరమహంస 190వ జయంతి మహోత్సవం కరపత్రాలను మద్దికెరలో శనివారం ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పారా రాఘవేంద్ర చేతులమీదుగా మొలగవల్లి రంగనాథ్ కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ రామకృష్ణ పరమహంస 190వ జయంతి సందర్భంగా 19, 20వ తేదీన మొలగవల్లి గ్రామంలో భారత జాతికి నా హితువు వ్యాసంపై గెలుపొందిన విద్యార్థులకు రూ.10 వేలు అందజేస్తారన్నారు. వివేకానంద టీషర్ట్‌లు, ఆవుల వీరేంద్ర అందజేస్తారు. కర్నూలు జిల్లా బీజేపీ అధ్యక్షుడు అక్కమ్మతోట రామకృష్ణ, గుమ్మనూరు కమలమ్మ నారాయణచే అన్నదాన ప్రసాదం నిర్వహిస్తామన్నారు. ఈరన్న ఎంబీబీఎస్ డాక్టర్‌చేత మెడికల్ క్యాంపు నిర్వహిస్తామన్నారు. రామకృష్ణ పరమహంస జయంతి మహోత్సవం ఘనంగా నిర్వహించేందుకు ప్రతిఒక్కరూ హాజరుకావాలని వారు కోరారు.

## ప్రైవేట్ వైద్యుల దోపిడిపై చర్యలు తీసుకోవాలని రోడ్డెక్కిన సిపిఐ



**కోడుమూరు, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త :** కోడుమూరు పట్టణంలోని ప్రవైట్ వైద్యుల దోపిడిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం స్థానిక సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో రోడెక్కి ఆందోళనకి దిగింది. ఈ మేరకు స్థానిక కోట్ల సర్కిల్ నుంచి పట్టణ పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీల్లో పట్టణంలో ప్రైవేట్ వైద్యుల దోపిడితో రోగులను తీవ్ర ఇక్కట్లకు గురి చేస్తున్నారని,అంతే గాక పట్టణంలో అనుమతుల్లేకుండా మెడికల్ షాపులను నిర్వహిస్తూ డ్రగ్స్ మాఫియాను నిర్వహిస్తూన్నారని వాటిపై చర్యలు తీసుకోవలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. అనంతరం ఈ ఆందోళనుద్ధేశించి సిపిఐ నాయకులు రాజు మాట్లాడారు. కోడుమూరులో సాగుతున్న వచ్చి రాని వైద్యంతో ఆసుపత్రులను నిర్వహిస్తూ సామాన్యులను దోచుకుంటున్నారన్నారు. వీటితో పాటు ఎక్కడపడితే అక్కడ అనుమతుల్లేకుండా మెడికల్స్ నిర్వహిస్తూన్నారని, వీటిపై సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకొని దోపిడిని అరికట్టాలని డిమాండ్ చేశారు. సిపిఐ అనుబంధ సంస్థల ప్రతినిధులు రాజు, ఎం.చిన్నరాముడు, మధు, రంగస్వామి, నాగేష్, మద్ది, శ్రీను, నాయుడు పాల్గొన్నారు.

## మాలిక్ బాబా గుడి ప్రాంతంను పరిశీలిస్తున్న కమిషనర్



**డోన్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త :** పట్టణ సమీపంలోని మాలిక్ బాబా గుడిలో ఉన్నటువంటి పాత బుగ్గ రామలింగేశ్వర స్వామి మాలిక్ బాబా గుడి ప్రాంతంలో మహాశివరాత్రి నీ పురస్కరించుకొని పట్టణ ఎస్ఐ శరత్ కుమార్ రెడ్డి పోలీసులతో ఏర్పాట్లను పరిశీలించారు మూడు రోజులపాటు జరిగే ఉత్సవాలు జరిగే వివిధ కార్యక్రమాలు జరిగే ప్రాంతాలను పరిశీలించారు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా వచ్చిన భక్తులకు అన్ని మౌలిక వసతులను కల్పించారు దేవాలయ సమీపంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు కావున దేవాలయ సమీపంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక ఉంచుతామని ఎస్సై శరత్ కుమార్ రెడ్డి తెలిపారు

## బస్సులు లేక ప్రయాణికులు ఇబ్బందులు

**డోన్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త :** ఆర్టీసీ బస్టాండ్ లో బస్సులు లేక ప్రయాణికులు చాలా ఇబ్బంది పడుతున్నారు అందులో భాగంగా మహాశివరాత్రి పురస్కరించుకొని శ్రీశైలం కు వివిధ డిపోల నుండి భక్తుల సౌకర్యార్థం శ్రీశైలంకు బస్సులు పోవడంతో ప్రతిరోజు తిరిగే సర్వస్ బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు చాలా ఇబ్బంది పడుతున్నారు ఉదయం 5గంటల నుండి గంటల తరబడి బస్సుల కోసం వేచిచూసి తిరిగి వాపసు వెళుతున్న దృశ్యం కనబడుతుంది డోన్ పట్టణంలో బస్టాండ్ ప్రయాణికులతో నిండిపోయింది కానీ ప్రభుత్వం మాత్రం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించినప్పటికీ అధిక సర్వీసులను పెంచడంలో ప్రభుత్వం విఫలమైందని మహిళలు వాపోతున్నారు

## 23వ వార్డులో అభివృద్ధి పనులు వేగవంతం



**ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:** ఎమ్మిగనూరు పట్టణంలోని 23వ వార్డులో 1కోటి 50 లక్షలతో తాగునీటి పైపులైన్ తోపాటు డ్రైనేజీలు, సీసీ రోడ్ల నిర్మాణ అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని 23వ వార్డు టీడీపీ ఇంచార్జి సోమల గూడూరు మహబూబ్ భాషా, చేనేత సీనియర్ నాయకులు బుగిడే నాగరాజులు పేర్కొన్నారు. శనివారం వార్డులో జరుగుతున్న తాగునీటి పైపులైన్ పనులను వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ వార్డులకు పెన్షన్ పంపిణీ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే బీవీ. జయ నాగేశ్వరరెడ్డి వార్డు ప్రజలు తాగునీటి పైపు లైన్ లేక ఇబ్బంది పడుతున్న సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా గడిచిన 13 రోజులకే తాగునీటి పైపు లైన్ పనులను చేపట్టారని తెలిపారు. అలాగే మునెప్ప నగర్, రాధాకృష్ణ కాలనీ ప్రాంతాల్లో పైపు లైన్ నిర్మాణనాలు చేపట్టారని తెలిపారు. తమ వార్డులో 1 కోటి 50 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టడంతో 23వ వార్డు ప్రజల తరఫున ఎమ్మెల్యే బీవీకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మిగనూరు అభివృద్ధి చెందాలంటే ఒక్క బీవీ కుటుంబంతోనే సాధ్యం అవుతుంద న్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పట్టణంలోని అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. దింతో వార్డుల్లో పనులను చూస్తున్న ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. టీడీపీ సీనియర్ నాయకులు బుగిడే నాగరాజు పాల్గొన్నారు.

## ఆర్టీసీని ఆకస్మికంగా తనిఖీ చేసిన రాఘవ కుమార్



**ఎమ్మిగనూరు రూరల్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త :** ఎమ్మిగనూరు ఆర్టీసీని ఆకస్మికంగా తనిఖీ నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ కడప ఫోర్త్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్ టి పి.రాఘవ కుమార్ శనివారం ఈ సందర్భంగా డిపో మేనేజర్ మద్దిలేటి నాయుడు ,ఎస్ టి పి రాఘవ కుమార్ మాట్లాడుతూ జిల్లా పర్యటన లో బాగంగా ఎమ్మిగనూరు ఆర్ టి సి ని తనిఖీ చేశారు.డిపో మేనేజర్ సి. మద్దిలేటి నాయుడు తో కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం డిపో మేనేజర్, అధికారులు,యూనియన్ నాయకులు రాఘవ కుమార్ ను పూలమాల శాలువాతో సత్కరించారు. తరువాత డిపో లో మొక్కలు నాటి, బస్టాండులో ,మెకానిక్ సెక్షన్, ఎలెక్ట్రిక్ సెక్షన్, టైరు సెక్షన్,లలో పర్యటించారు. సీటు సెక్షన్ లో అస్తవ్యస్తంగా ఉన్న సామాన్లను చూసి, అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఏలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా కలిసికట్టుగా ఉండాలని హెచ్చరించారు.శ్రీ శక్తి పథకం వచ్చినా కె. ఎం. పి.ఎల్ బాగానే తీస్తున్న డ్రైవర్లకు,కె. ఎం. పి. ఎల్ అవార్డులను అందుకున్న వారు బి.నవాజ్, బాబు ఉన్నారు. ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ వరప్రసాద్, ఏ డి సి లు,రాజు, శేఖర్, సిస్టమ్ ఇంచార్జీ ఖలీల్, ఏ. ఎం. ఎఫ్ బాలాంజనేయులు, టైర్ సెక్షన్ ఏ డి సి డి.ఎం.భాష, నేషనల్ మజ్దూర్ యూనియన్,డిపో కమిటీ, ఈ యు కమిటీ, ఆన్ కాల్ డ్రైవర్ లు కండక్టర్, మెకానిక్‌లు పాల్గొన్నారు.

## కటూమి ప్రభుత్వంలో.. ప్రధాని ఫోటోకు ప్రాధాన్యత ఏది..?



**నందవరం, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:** కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి రాగానే వివిధ దశల్లో ఇచ్చిన పథకాల అమలు చేస్తునే ఉంది. అందులో భాగంగా విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు కూడ కూటమి ప్రభుత్వం విడుదల చేసిన విషయం విధితమే. అయితే నందవరం మండలంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదేల పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, స్థానిక ఎమ్మెల్యే బివి జయనాగేశ్వర్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. టీడీపీ నాయకులు కూటమి ప్రభుత్వంలో ప్రజల వద్దకే పాలన తెస్తున్న ఏకైక ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని పేరు మాత్రమే చెబుతున్నారు. మండలంలో నిర్వహించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ కార్యక్రమంలో ప్రధాని నరేంద్రమోధీ చిత్రపటం లేకపోవడం చాల ఆశ్చర్యకరం. కూటమి ప్రభుత్వంలో ప్రధాని చిత్రపటానికి ప్రాధాన్యత ఏది అని కూటమి ప్రభుత్వంలో భారతీయ జనతాపార్టీ విడిపోయినట్టుగా ప్రజలు మాట్లాడుకోవడం వినికిడి. ప్రధాని ఫోటో లేకపోవడం ఇదంతా చుస్తుంటే నారా చంద్రబాబు నాయుడికి కేంద్రంతో సంబంధాలు బలహీనమా? కేంద్ర ప్రభుత్వంతో కూటమి ప్రభుత్వానికి సంబంధాలు బాగాలేవని సూచిస్తుందా అని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. కేంద్రం నుండి రావాల్సిన నిధులు రాకపోవడానికి ఇదే కారణమని వారు ఆరోపిస్తున్నారు. కనీసం తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు ప్రోటోకాల్ పాటించకపోవడం చాల విడ్డూకరమని ప్రజలు వాపోతున్నారు. ఒకవైపు మండలంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మండల నాయకులు ఏవరికి వారే యమునా తీరే అన్నట్లుగా ఉంది. ఇంత జరుగుతున్న ఎమ్మిగనూరు నియోజకవర్గ ఎమ్మెల్యే బివి జయనాగేశ్వర్‌రెడ్డి చూసి చూడనట్టుగా పాలన నిర్వహిస్తున్నట్టు కనిపిస్తోంది. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే ఇలాంటి తప్పులు మరోమారు జరగకుండా నందవరం ఉన్న మండల నాయకులకు శిక్షణా తరగతులు ఏర్పాటు చేసి కూటమి ప్రభుత్వంపై ప్రోటోకాల్ పాటించేవిధంగా చర్యలు తీసుకోవాలని ప్రజల నోటి శబ్దాలు బలంగా వినిపిస్తున్నాయి

## రాష్ట్రాభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం



**హొళగుంద, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త;** కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని దేవరగట్టు ఆలయ చైర్మన్ వీర నాగప్ప పేర్కొన్నారు. శనివారం ఆయన దేవరగట్టు ఆలయ ఆవరణం నుంచి దర్గా వరకు రూ.కోటి మంజూరైనట్లు తెలిపారు. అలాగే నెరణికి విద్యుత్ కార్యాలయం నుంచి గ్రామానికి వెళ్లే రహదారికి రూ.50 లక్షలు మంజూరయ్యాయన్నారు. ఈ రోడ్డు నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. ఆలూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్ ఆదేశాల మేరకు ఈ నిధులు మంజూరైనట్లు తెలిపారు. మూడు నెలల్లోనే ఆలూరు నియోజకవర్గంలో ఎన్నో అభివద్ధి పనులను ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి చేపడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో దేవరగట్టు ఆలయ వైస్ చైర్మన్ లోకనాయక్, టీడీపీ నాయకులు మల్లికార్జున, గ్రామస్తులు పాల్గొన్నారు.

## శ్రీశ్రీ సవారమ్మదేవి, లక్ష్మమ్మదేవి మహాద్వార శిఖర, కలశాల ప్రతిష్టకు ఆహ్వానం



**హొళగుంద, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త;** టీడీపీ యువ నాయకుడు రాజేంద్రగౌడ్‌కు హెబ్బటం గ్రామ వాల్మీకి నాయకులు శనివారం ఆహ్వాన పత్రికను అందించారు. శ్రీశ్రీ సవారమ్మదేవి, లక్ష్మమ్మదేవి మహాద్వార శిఖర, 11 కలశాల ప్రతిష్ట, శ్రీశ్రీ సుంకులమ్మదేవి పాదాల ప్రతిష్ట, శ్రీ వాల్మీకి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు ఈనెల 19వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జరుగుతాయని గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి ఈబీజీ గోవింద్‌గౌడ్‌ను ఆయన నివాసంలో ఆయన తనయుడు, టీడీపీ యువ నాయకుడు రాజేంద్రగౌడ్‌లను హెబ్బటం గ్రామ వాల్మీకి పెద్దలు, నాయకులు, గ్రామస్తులు కలిసి ఆహ్వాన పత్రికలను అందించి ఆహ్వానించారు. ఈ దైవ కార్యక్రమానికి తప్పకుండా వస్తామని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు, హెబ్బటం వాల్మీకి పెద్దలు, నాయకులు, ప్రముఖులు పాల్గొన్నారు.

## శివరాత్రి ఉత్సవాల్లో భక్తులకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు - సిఐ యుగంధర్

– బ్రహ్మగుండం క్షేత్రాన్ని పరిశీలించిన సిఐ,ఎస్సైలు..



**వెల్దుర్తి, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త :** ఉమ్మడి జిల్లాలోని శైవక్షేత్రాలలో ఒకటైన బ్రహ్మగుండం పుణ్యక్షేత్రంలో ఈనెల 15 నుంచి 18వ తేది వరకు మహాశివరాత్రి కళ్యాణం, రథోత్సవం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ ఉత్సవాలకు సంబంధించి స్థానిక పోలీస స్టేషన్‌లో శనివారం వెల్దుర్తి సర్కిల్ సిఐ యుగంధర్, ఎస్సై నరేష్‌తో కలిసి పాత్రికేయుల సమావేశం ఏర్పాటుచేశారు.ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఉత్సవాల్లో భక్తులకు ఎవరైనా సరే ఇబ్బందులు కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.శివరాత్రి ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా భద్రతా చర్యలు తీసుకున్నామన్నారు.ఆలయం చుట్టూ సిసి కెమెరాల నిఘాతో పాటు ప్రత్యేక పోలీసుల నిఘా ఏర్పాటుచేశామన్నారు.కొనేరు,క్యూలైన్ వద్ద తోపులాటకు ఆస్కారం లేకుండా తగు చర్యలు తీసుకున్నామన్నారు.పార్కింగ్‌కు ద్విచక్రవాహనాలు,కార్లు వేరువేరుగా ఉంచేలా జాగ్రత్తలు తీసుకున్నట్లు వివరించారు.బ్రహ్మగుండంలో పోలీస్ ఔట్‌పోస్టు ఏర్పాటు చేశామన్నారు.వెల్దుర్తి పాతబస్టాండ్ నుంచి బ్రహ్మగుండానికి ఒక బస్సు బయలుదేరిన తర్వాత మరొక బస్సు వెళ్లేలా ఆర్టీసి అధికారులకు సూచించామన్నారు.భక్తులకు ఇబ్బందులు కలిగించే ఆకతాయిలపై తమదైన శైలిలో కౌన్సెలింగ్ ఉంటుందన్నారు.అనంతరం సిఐ,ఎస్సై సిబ్బందితో కలిసి బ్రహ్మగుండంకు చేరుకున్నారు. అక్కడ దుకాణదారులతో సిఐ మాట్లాడుతూ మీకు కేటాయించిన స్థలాల్లోనే దుకాణాలు నడుపుకోవాలని సూచించారు. మీ దుకాణాల ముందు వాహనాలు నిలిపవద్దన్నారు.పెద్దశబ్దం వచ్చే విజిల్స్‌ను అమ్మరాదన్నారు.

## ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న నారాయణ జూనియర్ కళాశాలలను సీజ్‌చేయాలి

– ఆర్‌ఏవిఎఫ్ జిల్లా కార్యదర్శి ఖాజా



**కర్నూలు విద్య, ఫిబ్రవరి 14, ప్రభాతార్త:** విద్యాసంవత్సరం ముగియకముందే పదవతరగతి చదువుతున్న విద్యార్థులే టార్గెట్‌గా నారాయణ జూనియర్ కళాశాలల యాజమాన్యం ముందస్తు అడ్మిషన్లు చేసి పది నుంచి రూ.20 వేలు వరకు వసూలు చేయడం సిగ్గుచేటని రాయలసీమ అభ్యుదయ విద్యార్థి ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఖాజా పేర్కొన్నారు. శనివారం ఆర్‌ఏవిఎఫ్ ఆధ్వర్యంలో కర్నూలు టౌన్ మోడల్ కళాశాలలో వున్న ఆర్‌ఐఓ అఫీసులో ఆర్‌ఐఓ లాలప్పకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆర్‌ఏవిఎఫ్ జిల్లా కార్యదర్శి ఖాజా మాట్లాడుతూ నారాయణ విద్యాసంస్థల్లో పనిచేసే టీచర్లే టార్గెట్‌గా వారికి కమిషన్లు ఆశచూపి లేదా ముందస్తు అడ్మిషన్ల టార్గెట్ పూర్తిచేయకపోతే ఉద్యోగం నుండి తొలగిస్తామని భయభ్రాంతులకు గురిచేయడం అన్యాయమన్నారు. ముఖ్యంగా ఐఐటి, జేఈఈ సూపర్ చైనా పేరుతో వివిధ కోర్సులను ఆశచూపి విద్యార్థుల నుండి డబ్బులు దండుకొని తర్వాత రాయితీ ఇవ్వకుండా, డబ్బులు వాపసు ఇవ్వకుండా తల్లిదండ్రులను మోసం చేస్తున్న నారాయణ విద్యాసంస్థలపై క్రిమినల్ కేసులు నమోదుచేయపోతే పెద్ద ఎత్తున అందోళన చేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో నాయకులు వీరేష్ పాల్గొన్నారు.

## పేద ప్రజలను మోసం చేస్తున్న ఫార్మాకంపెనీలు-సిపిఐ



**వెల్దుర్తి, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త :** పేద ప్రజలను ఫార్మా కంపెనీలు మోసం చేస్తున్నాయని సిపిఐ మండల కార్యదర్శి టి.క్రిష్ణ అన్నారు.స్థానిక పాతబస్టాండ్‌లో శనివారం ఆయన సిపిఐ అనుబంధ సంఘాల నాయకులతో కలిసి డ్రగ్స్ మాఫియాపై ప్లకార్డులు చేత పెట్టుకొని నిరసన తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో డ్రగ్స్ మాఫియా పెరిగిపోతుందన్నారు.కర్నూలు జిల్లావ్యాప్తంగా ప్రైవేట్ హాస్పిటల్స్ చేస్తున్న దోపిడిపై చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలం చెందారని ఆరోపించారు. వెల్దుర్తి మండలంలో అనుమతులు లేకుండా నడుపుతున్న,అధిక ధరలకు మందులు అమ్ముతున్న మెడికల్‌షాపులను సీజ్ చేయాలని వారు డిమాండ్ చేశారు.వెల్దుర్తిలోని ప్రైవేట్ వైద్యశాలలపై సంబంధిత అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వెల్దుర్తి మండల సిపిఐ కార్యదర్శి టి.క్రిష్ణతో నాయకులు డి.రాజు, గిరి, అనిల్, చిలిపిక్రిష్ణ, వెంకటేశ్వర్లు బోయినపల్లి రాముడు, ఆంజనేయులు పుల్లయ్య, పెద్దయ్య, క్రిష్ణ, సీమోను పాల్గొన్నారు.

## ఘనంగా దివంగత మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి



**ఆదోనిటౌన్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త;** వైఎస్సార్సీపీ కార్యాలయంలో శనివారం వైఎస్సార్సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి కార్యక్రమాన్ని పార్టీ నేతలు చేపట్టారు. ముందుగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వైఎస్సార్సీపీ పట్టణాధ్యక్షులు బి.దేవా, కౌన్సిలర్ చలపతిలు మాట్లాడుతూ దామోదరం సంజీవయ్య ఉమ్మడి రాష్ట్రానికి తొలి దళిత ముఖ్యమంత్రిగా సేవలు అందించాడన్నారు. అప్పుడున్న పరిస్థితుల్లో అగ్రవర్ణాల ఆధిపత్యాన్ని ఎదురిస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు రాజకీయ చైతన్యం కలిగించిన వ్యక్తి, తొలి దళిత ముఖ్యమంత్రిగా దామోదరం సంజీవయ్య అని చెప్పారు. నిరుపేద దళిత కుటుంబానికి చెందిన దామోదరం సంజీవయ్య ముఖ్యమంత్రి స్థాయి వరకు ఎదిగాడన్నారు. ఆయన సేవలు మరువలేనివని, ప్రతిఒక్కరూ ఆయన అడుగు జాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు ఏసోబు, కౌన్సిలర్ అశోక్, ప్రచార అధ్యక్షులు పరిగణ నారాయణ, పట్టణ కార్యదర్శి తాయన్న, ఇర్ఫాన్‌బాషా, హరి, మాబాషా, నిజాం, యాసీన్‌బాషా, తారానాథ్, బ్యాంకు మల్లి, ఆర్‌వి బాబు, ఇంద్రనగర్ హనుమంతు, అంబేడ్కర్ నగర్ నరేష్, నల్లారెడ్డి, సూరి, గాజుల నాగరాజు, నారి, సిద్ధ, దినేష్, మాబాషా, మణి, వెంకీ, పూర్ణ, ఎల్లప్ప, కోదండ, మాబాషా, భాస్కర్, మలేకర గోవిందు, వెంకోబా, ఈరన్న, వీరాంజి, నాగప్ప పాల్గొన్నారు.

## 18న పట్టుబడిన వాహనాలకు వేలం పాట

– ఎక్సైజ్ సీఐ సైదుల్



**ఆదోనిటౌన్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త;** ఆదోని ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు ఈనెల 18వ తేదీన స్థానిక కార్యాలయ ఆవరణలో వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ సైదుల్ శనివారం విలేకరులకు తెలిపారు. ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం ఉంటుందని, ఆసక్తి గల వారు రూ.3 వేలు డిపాజిట్ చేసి వేలంలో పాల్గొనాలని సూచించారు. మరిన్ని వివరాలకు స్థానిక ఎక్సైజ్ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

## పూల్వమా దాడి వీర జవానులకు అశ్రు నివాళి



**దేవనకొండ, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త;** 2019 ఫిబ్రవరి 14వ తేదీన జమ్మూ కాశ్మీర్‌లోని పూల్వమా జిల్లాలో ఉగ్రవాదుల ఆత్మాహుతి దాడిలో వీర మరణం పొందిన 40 మంది సీఆర్‌పీఎఫ్ జవానులకు దేవనకొండ ప్రజలు శనివారం నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్‌ఎం ఎ.ఉచ్చీరప్ప, ఎఫ్‌ఆర్ స్కూల్స్ కరస్పాండెంట్ పి.రఘునాథ్, మాజీ సైనికులు రామాంజనేయులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి నివాళులు అర్పించారు. వారు మాట్లాడుతూ భారతదేశంలో జరిగే ఉగ్రవాద దాడులకు పాకిస్థాన్ దేశం ప్రధాన కారణమని, అనేక ఉగ్రవాద సంస్థలను పాకిస్తాన్ పెంచి పోషిస్తుందన్నారు. అనేక వేల భారత సైనికులు, భద్రతా సిబ్బంది, సామాన్య పౌరులను ఈ పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు పొట్టన పెట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీర జవానుల సేవలు మరువలేనివని, వారి సేవలను స్మరించుకోవాలన్నారు. వారి ఆశయ సాధనకై కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికులు బీసీ నరసింహులు, వెంకటరమణ, నాగరాజు, బ్యాంకు బ్రహ్మయ్య, సాయి, జగన్, బొడ్డు నాగరాజు, యువకులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గోనెగండ్ల మండలంలో కుక్కలు వీరంగం

– ఈఏడాది జనవరి, ఫిబ్రవరిలో 250 మందిపై దాడి – ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నవారు 150 మంది – గత ఏడాదిలో 1000 మందిపై కుక్కల దాడి – ఇబ్బందుల్లో మహిళలు, పిల్లలు



**గోనెగండ్ల, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన గోనెగండ్లతో పాటు మండల పరిధిలోని పలు గ్రామాల్లోని వీదుల్లో కుక్కలు వీరంగం చేస్తున్నాయి.పుట్టపాశం గ్రామానికి చెందిన నాగలక్ష్మి అనే వృద్ధురాలి కలిని కుక్కలు కరచడంతో గాయాం అయింది.చికిత్సనిమిత్తం నాగలక్ష్మి గోనెగండ్ల ప్రభుత్వ ఆసుప్రతికి వచ్చింది.గత మూడు రోజులుగా మండలంలోని పలు గ్రామాలలో చంద్రశేఖర్, నవాజ్, ఈరమ్మ, తిమ్మగురుడు, సాత్విక్, దివ్యలతో పాటు మరో 20 మందిపై కుక్కలు దాడి చేసి గాయ పరిచాయి.ఇందులో కొందరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించుకోగా మిగిలినవారు నాటు వైద్యం చేయించుకున్నారు.ఈ ఏడాది జనవరి,పి బ్రవరి నెలలో ఇప్పటి వరకు 250 మంది పై కుక్కలు దాడి చేసి గాయపరిచాయి.ఇందులో గోనెగండ్ల ఆసుప్రతిలో చికిత్సపొందిన వారు 150 మంది మాత్రమే,గత ఏడాది నవంబరు,డిసెంబరు నెలలో మండలంలోని పలు గ్రామాలలో 300 మందిపై కుక్కలు దాడులు చేశాయి.అందులో 94 మంది ఆసుపత్రిలో చికిత్సచేయించుకున్నారు.గత మూడు మాసాలుగా మండల వ్యాప్తంగా 500 మందిపై కుక్కలు దాడులు చేసి గాయ పరిచినట్లు తెలుస్తుంది.ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందినవారి లెక్కలు ఇవీ,మరి ప్రవేట్‌గా చికిత్స చేయించుకున్న వారి మరో 1000 పైగా నే ఉంటారు.అయితే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి యందు కుక్కల వ్యాక్సిన్ ఉన్ననట్లు వైద్యులు తెలుపుతున్నారు.గుంపులు గుంపులుగా తిరుగుతు వీదుల్లో తిరిగే జనంపై దాడులు చేస్తూ తీవ్ర గాయాలపాలు చేస్తున్నాయి.మండలంలోని గోనెగండ్ల,హెచ్ కైరవాడి,కులుమాల,పుట్టపాశం,వేముగోడు,గంజహళ్లి,తిప్పనూరు,కున్నూరు,అలువాల,పెద్దనేలటూరు, ఎద్దమరివీడు,గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో కుక్కలు అధిక సంఖ్యలో సంచరిస్తున్నాయి. జనసంచారం అధికంగా ఉన్న సెంటర్ల దగ్గర ,మటన్,చికెన్ దుఖాణాల దగ్గర కుక్కల హంగామా అంతా ఇంతా కాదు అటువైపు వెళాలంటే పిల్లలు,వృద్ధులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది.ఆయా గ్రామాల పంచాయతీ సిబ్బంది తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై శ్రీశైల మల్లన్న ఆశీస్సుల కోసమే పాదయాత్ర..!

: శ్రీశైలంలో మహాశివ రాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు భేష్...
: నంద్యాల జిల్లా ప్రజల బాగుకోసం అభయారణ్యంలో కాలినడకన ..
: నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.



**ఆత్మకూరు ఫిబ్రవరి 13, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వంలోని భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పై, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పై, నా నంద్యాల జిల్లా ప్రజలపై శ్రీశైల భ్రమరాంబ, మల్లికార్జున స్వామి వార్ల దీవెనలు, ఆశీస్సుల కోసం నల్లమల దట్టమైన పులుల ఆవాసమైన అభయారణ్యంలో కాలినడకన 42 కిలోమీటర్ల దూరం లోని శ్రీశైలం వెళుతున్నానని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. శనివారం నంద్యాల జిల్లా శ్రీశైల నియోజకవర్గం, ఆత్మకూరు మండలం పరిధిలోని వెంకటాపురం గ్రామంలోని శ్రీ మల్లేశ్వర స్వామికీ ప్రత్యేక పూజలు చేసి ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి శ్రీశైలంకు నల్లమల అరణ్యం గుండా కాలినడక మొదలు పెట్టారు. ఈ సందర్భంగా నల్లమల అడవిలోని గోసాయికట్ట శ్రీ ఆంజనేయస్వామికీ విశేషపూజల అనంతరం ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ తాను ప్రతి ఏటా మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా నల్లమల అభయారణ్యంలో కాలినడక ద్వారా శ్రీశైలం చేరుకొని శ్రీ భ్రమరాంబ, మల్లికార్జున స్వామి వార్లను దర్శనం చేసుకుంటున్నానని, ఈ ఏడాది కూడా మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఈ కాలినడక మొదలు పెట్టానన్నారు. శ్రీశైలంలో మొదటి రోజు శివ దీక్ష స్వాములపై పోలీసుల లాఠీ చార్జీ పై కొందరు విలేకరులు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరిని వివరణ కోరగా, స్వాములపై లాఠీ ఛార్జ్ అనవద్దని, మొదటి రోజు అంచనాకు మించి భక్తులు శ్రీశైలం రావడం వల్ల కొంత ఇబ్బంది కలిగిందని, పోలీసులు భక్తులను నియంత్రణ చేయడం జరిగిందని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా శ్రీశైలంలో సాఫీగా స్వామి, అమ్మవార్ల దర్శనం కల్పిస్తున్నారని, మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు ప్రభుత్వం బాగా ఏర్పాటు చేసిందని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి వివరించారు. వెంకటాపురం నుంచి నల్లమల అరణ్యంలో లక్షలాది మంది శివ భక్తులు శ్రీశైలంకు కాలినడకన వెళుతున్నారని, ఈ ఏడాది నల్లమల అభయారణ్యం లో పులుల లెక్కింపు జరుగుతున్నా భక్తులకు అటవీశాఖ ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేసిందని, ప్రభుత్వశాఖలు, దాతలు కూడా అన్నదానం, ఉచిత వైద్యం, తాగునీటి వసతి నల్లమల అరణ్యంలో కాలినడక భక్తులకు కల్పించడం అభినందనీయం అని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు.

# సామాజిక సమానత్వానికి ప్రతీక దామోదరం సంజీవయ్య

## కలెక్టరేట్ నుండి నంద్యాల చెక్‌పోస్ట్ వరకు ర్యాలీ

**కర్నూలు, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త :** సామాజిక సమానత్వానికి ప్రతీకగా నిలిచిన దామోదరం సంజీవయ్యను స్మరించుకుంటూ, విద్య ద్వారానే కుల వివక్షతను పూర్తిగా నిర్మూలించవచ్చని జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ పేర్కొన్నారు. శనివారం నిర్వహించిన దామోదరం సంజీవయ్య 105వ జయంతి వేడుకలు జిల్లాలో ఘనంగా జరిగాయి. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ నుండి నంద్యాల చెక్‌పోస్ట్ వరకు నిర్వహించిన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం నంద్యాల చెక్‌పోస్ట్ వద్ద ఉన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అక్కడ ఏర్పాటు చేసిన సభను జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించి అధికారులు, వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, 1925 ప్రాంతంలో దళితుల పరిస్థితి దయనీయంగా ఉండేదని, కుల వివక్షత తీవ్రంగా వ్యాపించి ఉండేదని తెలిపారు. అలాంటి పరిస్థితుల్లో కర్నూలు జిల్లా పెద్దపాడు గ్రామంలో జన్మించిన దామోదరం సంజీవయ్య కృషి, పట్టుదలతో రాష్ట్ర తొలి దళిత ముఖ్యమంత్రిగా ఎదగడం విశేషమన్నారు. ఆయన జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అనంతరం ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద ఆదోనికి చెందిన తాయప్పకు సాంఘిక సంక్షేమ శాఖలో వాచ్‌మెన్‌గా నియామక పత్రాన్ని అందజేశారు. అలాగే జయంతి సందర్భంగా జిల్లాలో నిర్వహించిన వ్యాసరచన, క్రీడా పోటీలలో విజేతలైన విద్యార్థులకు మెమెంటోలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రాధిక, సంఘ నాయకులు రాధాకృష్ణ, జ్యోతి, సోమన్న, చంద్రప్ప, వెంకటేశ్వర్లు, శ్రీను, రాజశేఖర్ ప్రసంగించారు. ట్రైబల్ వెల్ఫేర్ అధికారి సురేష్, మెప్మా పిడి శ్రీనివాసులు, వివిధ సంఘాల నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# బంజారా జాతి సంఘ సంస్కర్త సేవాలాల్ మహారాజ్ కు.. మాజీ ఎమ్మెల్యే నివాళి



**బనగానపల్లె ఫిబ్రవరి 14 ప్రభాత వార్త :** బంజారా జాతి సంఘ సంస్కర్త సేవాలాలు మహారాజ్ 287 వ జయంతి సందర్భంగా పట్టణంలో వైయస్సార్ పార్టీ కార్యాలయంలో బంజారా నాయకుల ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సేవాలాల్ మహారాజ్ కు నివాళి అర్పించారు. శ్రీశ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ వారి చిత్రపటానికి పూలమాల వేసి హారతి ఇచ్చి పూజలు నిర్వహించారు. కార్యక్రమం లో వైఎస్సార్సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధంరెడ్డి రామ్మోహన్ రెడ్డి, వైఎస్సార్సీపీ ఎస్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాండ్లావత్ శ్రీనివాస్ నాయక్, వైఎస్సార్సీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి ఈశ్వర్ నాయక్, వైఎస్సార్సీపీ రాష్ట్ర ఎస్సి సెల్ కార్యదర్శి దండు మధుబాబు, ఎస్ లక్ష్మానాయక్, రాముడు నాయక్, రాజునాయక్, రాజా నాయక్, చంద్ర నాయక్, తౌరే నాయక్, సక్రు నాయక్, కంబగిరి రాముడు నాయక్, సోమ్లా నాయక్, మనోహర్ నాయక్, రామోజీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# దామోదరం సంజీవయ్య సేవలు వెలకట్టలేనివి

– జనసేన పార్టీ ఉమ్మడి కర్నూలు జిల్లా కోఆర్డినేటర్ చింతా సురేష్‌బాబు



**కర్నూలు విద్య, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:** మాజీ ముఖ్యమంత్రి, స్వర్గీయ దామోదరం సంజీవయ్య చేసిన సేవలు వెలకట్టలేనివని జనసేనపార్టీ ఉమ్మడి కర్నూలు జిల్లా కో ఆర్డినేటర్ చింతా సురేష్‌బాబు అన్నారు. శనివారం దామోదరం సంజీవయ్య జయంతిని పురస్కరించుకొని జనసేన పార్టీ ఆధ్వర్యంలో నంద్యాల చెక్‌పోస్టు కూడలిలో ఉన్న సంజీవయ్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈసందర్భంగా చింతాసురేష్ బాబు మాట్లాడుతూ రాజకీయాల్లో ఎందరో నాయకులు పుట్టుకొస్తారు కానీ వారిలో కొందరు చిరకాలం ఉండిపోతారని 38 ఏళ్ళకే ముఖ్యమంత్రి పీఠం అదిష్టించి పార్టీలకతీతంగా గౌరవం అందుకుని తర తరాలు చర్చించుకునేలా సంక్షేమ పథకాలు అమలుచేసి పాలనలో సంస్కరణలకు శ్రీకారం చుట్టారన్నారు. నిజాయితీపరుడైన దామోదరం సంజీవయ్య జనసేనపార్టీ నాయకులకు ఎంతో స్ఫూర్తిదాయకం అన్నారు. ఈకార్యక్రమంలో శాలివాహన/కుమ్మరి కార్పొరేషన్ డైరెక్టర్ పిబివి సుబ్బయ్య, వాల్మీకి/బోయ కార్పొరేషన్ డైరెక్టర్ తోళ్ళ మంజునాథ్, కోడుమూరు నియోజకవర్గ నాయకులు సంధ్య, విక్రమ్‌కుమార్, మైనార్టీ నాయకులు షబ్బీర్, హుసేన్, నరసింహ, బజారి, రాజగోపాల్, విజయ్‌కుమార్, జాన్ తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీ శబరి శ్రీశైల పాదయాత్రకు బీజేపీ మోమిన్ షబానా సంఘీభావం.

: ముర్తుజావలి దర్గాలో ప్రత్యేక పూజలు

**ఆత్మకూరు ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** నంద్యాల జిల్లా శ్రీశైలం నియోజకవర్గం, ఆత్మకూరు మండల పరిధిలోని వెంకటాపురం గ్రామం నుండి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని దట్టమైన పులుల అభయారణ్యంలో గుండా శ్రీశైల క్షేత్రమునకు పాదయాత్రగా వెళ్తున్న నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరికీ శనివారం బీజేపీ కార్యవర్గ సభ్యురాలు మోమిన్ షబానా ఆధ్వర్యంలో నల్లమల లో వెలసిన ముర్తుజావలి దర్గా మసీదులో ప్రత్యేక పూజలు నిర్వహించి నాగులూటి మీదుగా పాదయాత్రతో సంఘీభావం తెలిపి ఆమె వెంట పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో బిజెపి కార్యవర్గ సభ్యురాలు మోమిన్ షబానా మాట్లాడుతూ నల్లమల అరణ్యం మధ్యలో ఉన్న చెంచుల రాజధాని పెచ్చేరువు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మధ్యాహ్నం విరామం సందర్భంగా దాతలు కాలినడకన శ్రీశైలం వెళ్లే శివ భక్తుల కోసం ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణలో భోజనం చేశారు. ధట్టమైన అడవి మధ్యలో ఉన్న పెచ్చేరువులో చెంచులు పూజల కోసం నిర్మాణంలో ఉన్న శివాలయాన్ని సందర్శించి, అక్కడ అన్నదాన ప్రదేశంలో, పాఠశాలలకు భోజన వసతులు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కల్పించి చెంచులతో కలిసి భోజనం చేశారు అనంతరం అడవి మార్గంలో ఎంపీ బైరి శబరి పాదయాత్రగా తరలి వెళ్లారు



# మహిమాన్వితుడు.. బ్రహ్మగుండేశ్వరుడు..!

–ఫిబ్రవరి 15 నుంచి 18వ తేది వరకు మహాశివరాత్రి ఉత్సవాలు

**వెల్దుర్తి, ఫిబ్రవరి14, ప్రభాతవార్త :** ఉమ్మడి కర్నూలు జిల్లాలోని శైవక్షేత్రాలలో ప్రసిద్ధిగాంచిన బ్రహ్మగుండం పుణ్యక్షేత్రంలో మహిమాన్వితుడు బ్రహ్మగుండేశ్వరుడిగా శ్రీ కామేశ్వరి సహితబ్రహేశ్వరస్వామి భక్తులను అలరిస్తున్నాడు. ప్రతి ఏటా ఇక్కడ దాదాపు వేలాది భక్తులు మహాశివరాత్రి ఉత్సవాలకు హాజరుకానున్నారు.

**– బ్రహ్మగుండక్షేత్ర మహాత్యం..**

బ్రహ్మగుండక్షేత్ర మహాత్యంగురించి పురాణాలు చెబుతూనే ఉన్నాయి. పూర్వం ద్వాపర యుగమున జనమేజయ మహారాజు సర్పయాగం నిర్వహించి సర్పశాపం వలన కుష్టావ్యాధి పీడితుడయ్యెను. ఆ వ్యాధి నివృత్తికోసం బ్రహ్మేశ్వరస్వామిని ప్రతిష్ఠ చేసినట్లు చారిత్రక ఆధారం కనపడుచున్నది. ధర్మాంగదుడు అను రాజు ఋషి శాపం వలన సర్పాకృతిని పొందెను. తీర్థయాత్రల సందర్శనం వలన శాపవిమోచనం కల్గునని ధర్మాంగదుని సతీమణి తెలుసుకొని సర్పాకృతి గల తన భర్తను తలమీద ఉంచుకొని సమస్త తీర్థక్షేత్రములు తిరిగినను శాపవిముక్తి కలుగలేదు. చివరికి బ్రహ్మగుండేశ్వరస్వామి క్షేత్రం నందలి పుష్కరిణిలో స్నామాచరించి బ్రహ్మేశ్వరున్ని సేవించగా సర్పాకృతి గల ధర్మాంగదుడు శాపవిమోచితుడై తిరిగి మానవునిగా అవతరించెను. ఇటువంటి మహిమాన్వితమైన బ్రహ్మగుండేశ్వరక్షేత్రదర్శనం, భక్తాదులకు సమస్త సుఖశాంతులు, ఆయురారోగ్య ఐశ్వర్యములు కలుగజేయుటలో సందేహం లేదు. ఇంతటి గొప్ప చరిత్ర గల శైవక్షేత్రం బ్రహ్మగుండ పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధిగాంచినది. ఈ క్షేత్రంలో పాము కాటు వేస్తే చనిపోరని, చెట్టు మీద నుంచి కింద పడితే చనిపోతారని వేదపండితులు, గ్రామపెద్దలు చెబుతారు.

**– బ్రహ్మగుండంలో శివరాత్రి ఉత్సవాల వివరాలు..**

బ్రహ్మగుండం ఆలయ కమిటీ నిర్వాహకులు బొమ్మన రాజశేఖర్‌రెడ్డి, శ్రీ బ్రహ్మేశ్వరస్వామి దేవస్థానం, ఉత్సవాల ప్రత్యేక అధికారి హనుమంతరావు,



కార్యనిర్వాహణ అధికారి ఇఓ ఆంజనేయులు ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి 18వ తేది వరకు శివరాత్రి బ్రహోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈనెల 15న ఆదివారం ఆలయంలో గణపతి పూజ, స్వస్తి పుణ్యాహావాచనం, పంచ గవ్య ప్రార్థన, మంట పారాధాన, అంకురారోపణం రాత్రి 12.45 నిమిషాలక వృశ్చికలగ్నంలో లింగోద్భవకాలమున శివపార్వతుల కళ్యాణోత్సవం అశేషభక్తజనుల నడుమ వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య, దేవాలయ ప్రాకారం చుట్టూ స్వామివారికి శేషవాహనోత్సవం నిర్వహిస్తున్నారు. 16.02.2026న సోమవారం గణపతిపూజ, మంటపారాధన, బలిహారణం, 17.2.2026న మంగళవారం సాయంత్రం 6 గంటల 18 నిమిషాలకు శ్రీ బ్రహ్మేశ్వరస్వామి, గంగాదేవి, గౌరిదేవి అమ్మవార్ల ఉత్సవ మూర్తులతో రథోత్సవం జరుగును. 18.2.2026 బుధవారం వసంతోత్సవం ఉదయం 9గంల నుంచి 11 గంటల వరకు ఆలయ ప్రాంగణంలో, రాత్రి 7.30 నిమిషాలకు వెల్దుర్తి గ్రామ పురవీధుల్లో గ్రామోత్సవం గ్రామపెద్దల ఆధ్వర్యంలో జరుగునని ఇఓ తెలిపారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్నిరకాల మౌలికవసతులు కల్పిస్తున్నామన్నారు. త్రాగునీటిని ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆలయం ఎదుట పోలీస్ ఔట్‌పోస్టుతో పాటు, వైద్యశిబిరంను ఏర్పాటుచేస్తున్నామన్నారు. ఆలయ ప్రాంగణంలో వెల్దుర్తి గ్రామపంచాయతీ ఇఓ లక్ష్మీనాథ్ ఆధ్వర్యంలో గత కొన్నిరోజులుగా పారిశుద్ధ్యకార్మికులు పారిశుద్ధ్యపనులు చేపట్టారు.

**– భక్తులకు అల్పాహారం..**

మహాశివరాత్రి సందర్భంగా ఈనెల 15న సాయంకాలం నుంచి రాత్రి వరకు బ్రహ్మగుండానికి వచ్చే భక్తులకు కీ.శే. కెయి. మాదన్నగారి సంస్మరణార్థము వారి కుమారులు మాజీ డిప్యూటీ సిఎం కెయి క్రిష్ణమూర్తి, మాజీమంత్రి, ఎంఎల్‌సి కెయి ప్రభాకర్‌ల ఆధ్వర్యంలో పత్తికొండ నియోజకవర్గ ఎమ్మెల్యే కెఇ శ్యాంబాబులచే అల్పాహారం ఏర్పాటు చేయబడ్డాయన్నారు.

**–మాజీ ఎమ్మెల్యే కంగాటిశ్రీదేవి కుటుంబీకులు అల్పాహారం ఏర్పాటు..**

చెరుకులపాడు గ్రామం కీ.శే.కె.శివారెడ్డి, కె.చెరుకులపాడు లక్ష్మీనారాయణరెడ్డి, వైకాపా కార్యకర్త బోయసాంబశివుడుల సంస్మరణార్థం వారి కుటుంబసభ్యులు వైకాపా రాష్ట్రకార్యదర్శి కె.ప్రదీప్‌కుమార్‌రెడ్డి, పత్తికొండ నియోజకవర్గ వైకాపా ఇంచార్జ దివంగత చెరుకులపాడు నారాయణరెడ్డి సతీమణి పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, క్రిష్ణగిరి ఎంపిపి డాక్టర్.కె.వెంకట్రామిరెడ్డి, వైకాపా యువనాయకులు కంగాటి రాంమోహన్‌రెడ్డి వారి కుటుంబసభ్యులచే భక్తులకు అల్పాహారం సమర్పణ ఉంటుందన్నారు.



# బి నాగిరెడ్డిపల్లెలో అగ్నిప్రమాదం

– సజీవదహనమైన ఆవు, నాలుగు గేదెలకు తీవ్రగాయాలు

**రుద్రవరం, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:** మండల పరిధిలోని బి నాగిరెడ్డిపల్లె గ్రామంలో శుక్రవారం రాత్రి సంభవించిన అగ్నిప్రమాదంలో పశువుల పాక దగ్ధం కావడం జరిగిందని గ్రామస్థులు తెలిపారు. శనివారం గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు బి నాగిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన రైతు సుధాకర్ రాత్రి సమయంలో దోమలదాడి నుండి తన పశువులను రక్షించే క్రమంలో పశువుల కొట్టంలో పొగ పెట్టడం జరిగిందన్నారు. పొగ నుంచి ఒక్కసారిగా



మంటలు చెలరేగి పశువుల కొట్టం కాలుతూ మంటలు వ్యాపించడం జరిగిందన్నారు. మంటలను గమనించిన గ్రామస్థులు అక్కడికిచేరుకొని మంటలను అదుపుచేసే సమయానికి పశువుల కొట్టంలోని ఒక ఆవు పూర్తిగా కాలిపోయి సజీవదహం అయిందన్నారు. నాలుగు గేదెలు, ఒక దూడ అగ్నిప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాయన్నారు. పశువుల కొట్టంలోని వ్యవసాయ సామాగ్రి పూర్తిగా కాలిపోవడం జరిగిందన్నారు. విషయం తెలుసుకున్న మండల పశు సహాయ సంచాలకులు డా. మనోరంజన్ ప్రతాప్ తన సిబ్బందితో హుటాహుటిన అక్కడికి చేరుకొని గాయపడిన గేదెలకు తక్షణ వైద్యసేవలు అందించారు. అగ్నిప్రమాదంలో జరిగిన నష్టాన్ని గుర్తించేందుకు స్థానిక విఆర్వో నిలకంటేశ్వర్ అక్కడికి చేరుకొని వివరాలు సేకరించారు. అగి న్రప్రమాదంలో పూర్తిగా నష్టపోయిన రైతు సుధాకర్‌కు ప్రభుత్వం స్పందించి ఆర్థికసాయం చేయాలని గ్రామస్థులు కోరారు. ఈయన పేరురూ సచివాలయ ఏహెచ్‌ఏ ఉన్నారు.

# మైనార్టీల సంక్షేమానికి రూ.6090 కోట్ల భారీ బడ్జెట్

– మైనార్టీల అభివృద్ధికికూటమి ప్రభుత్వం కంకణం
– రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్

**నంద్యాల, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వం 2026–27 సంవత్సరానికి ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మైనార్టీల సంక్షేమానికి రూ.6090 కోట్లు కేటాయించడంపై రాష్ట్రన్యాయ మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ప్రశంసల జల్లు కురిపించారు. రాష్ట్రంలో మైనార్టీల సంక్షేమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారధ్యంలో కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్న విషయాన్ని ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రాధాన్యత కల్పించడమే ఇందుకు నిదర్శనమన్నారు. శనివారం అమరావతిలో విడుదల చేసిన ప్రకటనలో మంత్రి పేర్కొన్నారు. సిఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ఆర్థికమంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మైనార్టీల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యతతో కూడిన బడ్జెట్



మొత్తాన్ని ప్రకటించడం జరిగిందన్నారు.

**అదనంగా రూ.656 కోట్లు:** మైనార్టీల అభివృద్ధి సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కంకణబద్ధంగా కృషిచేస్తుందని 2025–26 బడ్జెట్ రూ.5434 కోట్లు కేటాయించగా 2026–27 బడ్జెట్‌లో అదనంగా రూ.656 కోట్లు కేటాయించి మొత్తం రూ.6090 కోట్ల బడ్జెట్ కేటాయించడం జరిగిందన్నారు. మైనార్టీలకు ఇచ్చిన హామిని నేరవేర్చడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. మైనార్టీల సబ్‌ప్లాన్ ద్వారా ఇతర శాఖల ద్వారా మైనార్టీలు లబ్ది పొందేందుకు వీలుగా సబ్‌ప్లాన్‌కు రూ.3133 కోట్లు కేటాయించడం జరిగిందన్నారు.

**సబ్‌ప్లాన్ ద్వారా మరింత లబ్ది:** మైనార్టీ సబ్‌ప్లాన్ అమలు కింద ఇతర శాఖల ద్వారా మైనార్టీలకు మరింత మేలు చేకూరుతుందని మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు. వ్యవసాయం, ఉద్యానశాఖ, మత్స్యశాఖ, ఎనర్జీశాఖ, పాఠశాల విద్యాశాఖ ద్వారా పౌర సరఫరాల శాఖ ద్వారా గృహనిర్మాణశాఖ ద్వారా పరిశ్రమల శాఖ ద్వారా గ్రామీణాభివృద్ధిశాఖ ద్వారా దివ్యాంగులు, ట్రాన్స్‌జండర్‌లు, సీనియర్ సిటిజన్లకు లబ్దిచేకూరుతుందని మంత్రి తెలిపారు. మైనార్టీ సబ్ ప్లాన్ ద్వారా రూ.3133 కోట్లు మైనార్టీ సంక్షేమానికి రూ.2957 కోట్లు మొత్తం రూ.6,090 కోట్ల బడ్జెట్‌తో 2026–27 వార్షిక ప్రణాళిక అమలు చేయబోతున్నామని మంత్రి పేర్కొన్నారు.

# మనసున్న మారాజు.. మునిస్వామి

– నిరుపేదకు రూ.1.75 లక్షలు అందజేత
– హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

**కర్నూలు, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త :** ప్రస్తుత సమాజంలో ఎక్కడ చూసినా స్వార్థమే కనిపిస్తోంది. సొంత అన్నదమ్ములను సైతం నమ్మే పరిస్థితులు కనిపించడం లేదు. అయితే మునిస్వామి అనే వ్యక్తి మాత్రం తన కుటుంబానికి సంబంధం లేని నిరుపేద కుటుంబాన్ని ఆదుకుని మనసున్న మారాజు అనిపించుకున్నారు. బాధితునికి తన సొంత డబ్బును ఇచ్చి సమాజంలో ఇంకా మానవత్వం ఉందని నిరూపించాడు. నిరుపేదను ఆర్థికంగా ఆదుకోవడంతో మునిస్వామిని గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందించారు. వివరాల మేరకు.. మండల పరిధిలోని



ఎం.తాండ (మాధవరం తాండ) గ్రామానికి చెందిన రాము న్నాయక్ అనే వ్యక్తి గ్రామంలోని రోడ్డు పక్కలో ఉన్న తన ఇంటిలో తన భార్య, ముగ్గురు పిల్లలతో కలిసి నివాసం ఉంటున్నాడు. అయితే తన ఇల్లు రోడ్డు పక్కనే ఉండడంతో గ్రామంలోకి భారీ వాహనాలు వచ్చినప్పుడు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఎప్పుడు ఏ వాహనం తన ఇంటిపై పడుతుందో అంటూ ప్రాణభయంతో కుటుంబ సభ్యులు కాలం గడిపేవారు. అక్కడ సీసీ రోడ్డు వేయడం కూడా ఇబ్బందిగా మారింది. ఇది గమనించిన గ్రామానికి చెందిన మునిస్వామి నిరుపేద కుటుంబం పడుతున్న ఇబ్బందిని గుర్తించాడు. వీరి ఇల్లు గ్రామాభివృద్ధికి ఆటంకం కావడంతో తన సొంత డబ్బులతో వారి కుటుంబానికి కొనుగోలు చేసి ఇవ్వాలని అనుకున్నాడు. అనుకున్నదే తడువుగా వారి కుటుంబానికి అవసరమైన ఇంటి స్థలం కొనుగోలుకు రూ.1.75 లక్షలు సొంత డబ్బును విరాళంగా ఇచ్చాడు. నిరుపేద కుటుంబానికి తన సొంత డబ్బును విరాళంగా ఇవ్వడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు మునిస్వామిని ప్రత్యేకంగా అభినందించారు. గ్రామంలో మానవత్వంతో ఆలోచించి ఓ కుటుంబాన్ని ఆదుకోవడంతో గ్రామస్తులు అందరూ హర్షం వ్యక్తం చేశారు. భగవంతుడు మునిస్వామిని ఆయురారోగ్యాలతో దీవించాలని ఆకాంక్షించారు.



# కష్టపడే వారికి పార్టీలో పదవులు వరిస్తాయి



**కర్నూలు అర్బన్ ఫిబ్రవరి 13 ప్రభాతవార్త :** వైఎస్ఆర్సిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రామభూపాల్ రెడ్డి మరియు యువనాయకుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు కాటసాని శివ నరసింహారెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిసిన పాణ్యం నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు ఎం. యువరాజుఈ సందర్భంగా వారికి పూలమాలతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. అనంతరం కాటసాని మాట్లాడుతూ పార్టీ కొరకు పాటు పడాలని తెలిపారు ఈ సందర్భంగా వచ్చిన నాయకులకు కాటసాని కృతజ్ఞతలు తెలిపారుఈ కార్యక్రమంలో ఓర్వకల్లు మండల నాయకులు జడ్పిటిసి, ఎంపీపీ, వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు అనుబంధం విభాగాల వివిధ హోదాలో ఉన్నవారు పాల్గొన్నారు.

# మాజీ మంత్రి జోగి రమేష్‌ను పరామర్శించిన మంత్రాలయం ఎమ్మెల్యే



**కర్నూలు, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త;** విజయవాడ ఇబ్రహీంపట్నంలోని మాజీ మంత్రి జోగి రమేష్‌ను, ఆయన కుటుంబ సభ్యులను, అలాగే అంబటి రాంబాబు కుటుంబ సభ్యులను మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి శనివారం పరామర్శించారు. ఇటీవల జరిగిన ఘటనలకు సంబంధించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని, త్వరలోనే మంచి రోజులు వస్తాయని ధైర్యం చెప్పారు.

# ఆదర్శప్రాయులు దామోదరం సంజీవయ్య

– నగరపాలక డిప్యూటి కమిషనర్ సతీష్‌కుమార్‌రెడ్డి



**కర్నూలు మున్సిపల్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:** నేటి యువతరానికి మాజీ ముఖ్యమంత్రి, స్వర్గీయ దామోదరం సంజీవయ్య ఆదర్శప్రాయులని నగరపాలక డిప్యూటి కమిషనర్ సతీష్‌కుమార్‌రెడ్డి, మేనేజర్ చిన్నరాముడులు అన్నారు. శనివారం దామోదరం సంజీవయ్య జయంతిని పురస్కరించుకొని వెంకటరమణ కాలనీలోని నగరపాలక తాత్కాలిక కార్యాలయంలో సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దామోదరం సంజీవయ్య దేశంలోనే తొలి దళిత ముఖ్యమంత్రిగా చరిత్ర సృష్టించారన్నారు. సమాజానికి స్ఫూర్తి ప్రధాన అయిన సంజీవయ్య జిల్లాలోని పెద్దపాడు గ్రామంలో 1921 ఫిబ్రవరి 14న నిరుపేద కుటుంబంలో జన్మించారన్నారు. కార్మిక శాఖమంత్రిగా ఉన్నప్పుడు ఆయన బోనస్‌లు ప్రకటించారని, వృద్ధాప్య పెన్షన్లు ప్రవేశపెట్టారని ఆయన మన జిల్లాలో పుట్టడం గర్వకారణమన్నారు. ఈకార్యక్రమంలో కార్యదర్శి నాగరాజు, సిబ్బంది వెంకటేశ్వర్లు, వినోద్, విజయ్, నవీన్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# దామోదరం సంజీవయ్య 105వ జయంతి వేడుకలు

**కర్నూలు అర్బన్ ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :** కర్నూలు నగరంలోని నంద్యాల చెక్ పోస్ట్ దగ్గర ఉన్న మహనీయుడు, మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య 105వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు అర్పించి ఘనంగా నివాళు లర్పించిన వైఎస్ఆర్సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంజీవయ్య సేవలను స్మరించుకున్నారు. సామాజిక న్యాయం, సమానత్వం కోసం ఆయన చేసిన కృషి తరతరాలకు ఆదర్శమని పేర్కొన్నారు. సంజీవయ్య ఆశయాలు చిరస్థాయిగా నిలవాలనీ, ఆయన చూపిన మార్గంలో ముందుకు సాగుదామని తెలిపారు. ఈ వేడుకల్లో అనుబంధ విభాగాల అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

